సంచలన వార్తా పత్రిక

లీడర్

SANCHALANA VAARTHA PATRIKA LEADER

శుక్రవారం • 18 జనవరి 2019 । సంపుటి : 21 సంచిక : 174 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00

Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

Read / Share / Follow

www.leaderepaper.com

www.facebook.com/leaderramanamurthy/

www.twitter.com/leaderramanamurthy/

ఫ్రంట్ అండ్ ఫ్యాన్



టార్గెట్ చంద్రబాబు • రిటర్న్ గిఫ్ట్ యమ కాస్ట్లీ

(ప్రత్యేక ప్రతినిధి)

మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాన్ని కీలక మలుపు తిప్పేలా కేసీఆర్ జగన్ చేతులు కలిపారు. ఇది ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందన్నది ఇపుడు చర్చగా ఉంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లి రెండవమారు తెలంగాణాలో గెలిచి నిలిచిన జగజ్జెట్టీ కేసీఆర్ ఇపుడు ఏపీలో ఏం చేయబోతున్నారన్నది ఆసక్తికరమైన పరిణామమే. చంద్రబాబును, ఆయన నలభయ్యేళ్ల రాజకీయాన్ని తీసిపారేస్తున్న కేసీఆర్ బాబుకు చెక్ పెట్టేందుకు ఆయన శత్రువు, వైసీపీ అధినేత జగన్‌ను మిత్రుడిగా చేసుకున్నారు. దీని వల్ల కేసీఆర్ కలల ప్రయోగం ఫెడరల్ ఫ్రంట్ జీవం పోసుకుంది. అదే సమయంలో ఏపీలో జగన్‌కు జరిగే మేలు ఏంటి, బాబుకు వచ్చే నష్టమేంటన్నది కూడా ఇక్కడ చూడాలి. ఏపీ వరకూ చూస్తే కేసీఆర్ పట్ల అభిమానం ఉన్న వారున్నారు తప్ప, ఆయన ఏపీ రాజకీయాన్ని మార్చే పరిస్థితి అయితే లేదన్నది వాస్తవం. టీఆర్ఎస్ పూర్తిగా తెలంగాణాకు పరిమితమైన పార్టీ. పైగా, ఉద్యమం నాటి కాలంలో కేసీఆర్ ఆంధ్రులను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోశారు. అయితే, , తెలంగాణా సాధించిన తరువాత మాత్రం కేసీఆర్ పూర్తిగా వేరే వైఖరి అవలంబించారు. నిజంగా చెప్పుకోవాలంటే గడచిన అయిదేళ్ల కాలంలో ఆయన ఆంధ్రులను పల్లెత్తు మాట అన్నది లేదు, పైగా సెటిలర్లకు ఆయన ప్రాధాన్యత కూడా కల్పిస్తూ వస్తున్నారు. ఈ పరిణామమే కేసీఆర్ పట్ల ఏపీ ప్రజలకు సానుకూలమైన అభిప్రాయాన్ని కలిగించిందను కోవాలి. ఇక, కేసీఆర్ తెలంగాణా

మిగతా 2లో



ముసుగు తొలగింది

కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ లో ఒక్క వైఎస్ జగన్ తప్ప మరెవరూ భాగం కాబోరని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ కు ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీల నుంచి ఎంతమాత్రమూ స్పందన లేదని అన్నారు. కేటీఆర్, జగన్ లు హడావుడిగా భేటీ అయ్యారని అభిప్రాయపడ్డ చంద్రబాబు, ఈ భేటీతో రెండు పార్టీల మధ్యా ఉన్న ముసుగు తొలగిపోయిందని చెప్పారు. బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చాలన్నదే కేసీఆర్ కుట్రని, అందుకు సహకరించేందుకు జగన్ సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కాకుండా

మిగతా 2లో

మన్నించు అన్నా..!



నగరంలోని రైల్వే న్యూకాలనీలో గత మూడేళ్ళుగా అన్న నందమూరి విగ్రహం ఇలా ముసుగేసుకునే వుంది. ఆవిష్కరణకు నోచుకోకుండా పడి వుంది. తెలుగుజాతి కీర్తిని పెంచిన మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహానికి ఈ దుస్థితి దాపరించడం పట్ల అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్న పాలకులు ఈ విగ్రహం పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిలదీస్తున్నారు.

- న్యూస్‌లీడర్, విశాఖపట్నం

కొలువు తీరిన తెలంగాణా అసెంబ్లీ

మొదటిగా ప్రమాణం చేసిన కెసీఆర్... స్పీకర్‌గా పోచారం



హైదరాబాద్: ఈ మధ్యనే ఎన్నికలు జరిగిన తెలంగాణా శాసనసభ గురువారం కొత్తగా కొలువు తీరింది. ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు గజ్వేల్ శాసన సభ్యుడిగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కాగా, తెలంగాణ రెండో శాసనసభలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. రాష్ట్ర తొలి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన 76 మంది ఎమ్మెల్యేలు తిరిగి ఎన్నికయ్యారు. 23 మంది తొలిసారి శాసనసభలో అడుగు పెట్టారు. సభలో అత్యంత సీనియర్ సభ్యుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ఇప్పటి వరకూ ఆయన ఉప ఎన్నికతో పాటు ఎనిమిది సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. తరువాతి స్థానంలో ఎర్రబెల్లి దయాకర్ రావు, రెడ్యానాయక్, ముంతాజ్ అహ్మద్‌ఖాన్ సీనియర్లుగా ఉన్నారు. ఉప ఎన్నికతో కలిపితే హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ ఆరుసార్లు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎక్కువ వయసు ఉన్న సభ్యుడు కాగా, ఇల్లెందు ఎమ్మెల్యే

మిగతా 2లో

తిరుగుమోత !!

పట్నానికి పయనం • జాతరలా రహదారులు

కిక్కిరిసిన రైళ్లు, బస్సులు • ప్రయాణీకులకు తప్పని ప్రయి'వేటు'



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన "సంక్రాంతి" పండగ ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. ముచ్చటగా మూడు రోజులు ఇట్టే గడచి పోయాయి. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో వున్న వారు, బంధువులు, మిత్రులు ఇలా అందరూ తమ సొంత వూర్లకు వెళ్లి మరీ సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పండగంతా పల్లెలకేనా అన్నట్టు సంబరాలు మిన్నునంటాయి. సంక్రాంతి వేడుకకు దాదాపు రెండు , మూడు రోజులు నుండి ప్రారంభమైన రాకపోకలు, సంక్రాంతి పూర్తయి రెండు రోజుల కావస్తున్నా ఏమాత్రం రోడ్లుపై రద్దీ తగ్గలేదు. జాతర తలపించేలా జాతీయ రహదారితో పాటు, వివిధ ప్రాంతాలకు వెళ్లేరహదారులు, రైల్వేస్టేషన్‌లు, బస్‌స్టేషన్‌ల్లో జనం కిక్కిరిసిపోతున్నారు. ముఖ్యంగా విశాఖనగరంలో విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్ర వ్యాపారాలతో వున్నవారంతా సంక్రాంతి ముందురోజు, అంతకుముందు రోజే వారి వారి ఊర్లకు పయనమయ్యారు.ఆ సందర్భంలో విపరీతమైన రద్దీ ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే పండగ ముగించుకొని తిరిగి మళ్లీ విశాఖపట్నంతో పాటు విశాఖ మీదుగా వివిధ ప్రాంతాలకు తిరిగి చేరుకునేందుకు కూడా తీవ్ర రద్దీ ఎదుర్కొనక తప్పడం లేదు. చాలా మంది విశాఖ చేరుకునేందుకు ప్రయాణంలో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ప్రత్యేక రైళ్లు, బస్సులు నడుపుతున్నప్పటికీ, అవి ఏమూలకు చాలకపోవడంతో ప్రయివేటు వాహనాలను ప్రయాణీకులు ఆశ్రయించడం చాలా వాహనాలు ప్రయాణీకులు వేలాడుతూ రాకపోకలు చేస్తుండడం గమనార్హం. అదే సందర్భంలో పండగ సందర్భంగా ఏర్పడే రద్దీ, ఇబ్బందులను దృష్టిలో

మిగతా 2లో

గుండెల్లో రైళ్ళు

కోడికత్తి కేసులో దర్యాప్తు వేగవంతం

పదిహేను మందికి నోటీసులు జారీ చేసిన ఎన్ఐఏ



విశాఖపట్నం,న్యూస్‌లీడర్ : విశాఖ విమానాశ్రయంలో గత సంవత్సరం అక్టోబరు25 తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై దాడి జరిగిన సంఘటనే విదితమే. ఈకేసు విషయమై ఈ నెల 4వతేదీన హైకోర్టు జాతీయదర్యాప్తు సంస్థకు అప్పగించింది. ఈ కేసులో ఇప్పటికే నిందుతుడు శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకుని ఎన్ఐఏ అధికారులు వివిదకోణాల్లో దర్యాప్తు ముమ్మరంచేశారు. నిందితుడితో సంబంధాలు కలిగిఉన్న ప్రతిఒక్కరినీ విచారించేందుకు సిద్దమయ్యారు. అదేవిధంగా దాడి జరిగిన రోజు సంఘటనా స్థలంలో వున్న పలువురికి వ్యక్తిగతంగా ఈనెల 17,18తేదీలలో హాజరుకావాలంటూ లిఖితపూర్వక నోటీసులు జారీచేయడంతో పాత్రధారులు, సూత్రదారులకు గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. మాజీకార్పొరేటర్ జియ్యాని శ్రీదర్, సిఐఎస్‌వో వేణుగోపాల్, ఎయిర్‌పోర్టు క్యాంటీన్ నిర్వాహకుడు వంటి పదిహేనుమందికి నోటీసులు జారీచేసినట్లు సమాచారం. అయితే హర్షవర్ధన్ చౌదరీ నోరువిప్పితే మరికొంతమంది తెరవెనుక పాత్ర, సూత్రధారులు పేర్లు బయటపడే అవకాశం వుందని వైసీపీ నేతలు తెలుపుతున్నారు. ప్రధానంగా తూర్పునియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుచౌదరిపైన కూడా ఈ విషయంలో వైసీపీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెలగపూడి నేరచరిత్ర కలవాడని, వంగవీటి మోహనరంగా హత్యకేసులో నిందితునిగా వున్న వ్యక్తి, విశాఖ వచ్చి ఎమ్మెల్యే కావడంతో పాటు,

మిగతా 2లో

పడగవిప్పిన పాత కక్షలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకుల హత్య

కనుమ వేళ గంగవరం,చిననాగమయ్యపాలెంలో విషాదం



హతుడు పేర్ల ధనరాజు

గాజువాక/భీమిలి, న్యూస్‌లీడర్ :నగరంలో యువకుల మధ్య పాత కక్షలు కనుమ వేడుక రోజున పడగవిప్పింది. మద్యం మత్తులో బీరుబాటిలే ఆయుధంగా చేసుకొని నిర్ధాక్షణ్యంగా తన స్నేహితుల్నే హత మార్చిన సంఘటన నగరాన్ని ఒక్క సారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది. రెండు వేర్వేరు ప్రదేశాల్లో గురువారం చోటుచేసుకున్న ఈ రెండు హత్యలు ఆయా ప్రాంత ప్రజలను శోకసంద్రంలోకి నెట్టేసింది. ఈ రెండు హత్యలు మద్యం మత్తులోనే జరగడం, పాత కక్షలు నేపథ్యంలోనే హత్యలకు దారితీయడం గమనార్హం. కనుమ రోజున మాంసం, మద్యం మత్తులో తేలాడుతూ ఇదే సందర్భంలో పలువుర్ని టార్గెట్ చేస్తూ దుర్మార్గంగా హత్యలకు పాల్పడే విష సంస్కృతి విశాఖ నగరంలో ఇటీవల కాలంలో మరింత శృతిమించింది. గంగవరంలో ఆటో డ్రైవర్

మిగతా 2లో

జగమే మాయ!



మళ్లీ బెలూన్ ఫెస్టివల్

నాలుగు కోట్లతో సోకు

ఈవెంట్ల మోజులో సర్కారు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : విశాఖ ఏజెన్సీ అరకులో మరోసారి బెలూన్ ఫెస్టివల్‌కు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్న బెలూన్ ఫెస్టివల్ కోసం నాలుగు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. గతసారి బెలూన్ ఫెస్టివల్‌ను నవంబర్

మిగతా 2లో

సంచలన వార్తాపత్రిక
లీడర్
క్లాసిఫైడ్స్

విశాఖపట్నం | శుక్రవారం 18-1-2019

ఫ్రంట్ అండ్ ఫ్యాన్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా సాధించిన విజయాలు సాటి తెలుగు వారిగా స్ఫూర్తిని నింపుతున్నాయి. అదే సమయంలో ఆయన పాలనాపరంగా అభివృద్ధి, సంక్షేమం అన్నవి రెండింటినీ కులుపుకుని సాగుతున్న తీరు కూడా ఇక్కడ చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా, రైతులు, పేదల కోసం ఆయన చేపట్టిన పథకాలు సర్వత్రా ఆమోదంగా ఉంటున్నాయి. ఆ ప్రభావం ఏపీపైన బాగానే పడుతోందనడానికి బాబు సైతం సంక్షేమ బాట పట్టడమే ఉదాహరణ. ఇక, కేసీఆర్ వ్యూహాలు, ఎత్తులు, జిత్తులు, అనేకమార్లు ఢిల్లీ పెద్దలను గడగడలాడించిన తీరు కూడా ఆంధ్రులు తరచూ ప్రస్తావించుకుంటూంటారు. ప్రత్యేక హోదాను ఏపీ ప్రజలు పొందలేకపోవడానికి కేసీఆర్ లాంటి సమర్ధుడైన నాయకుడు లేకపోవడమేనని చాలాసార్లు ఏపీ జనం అనుకున్న సంగతి కూడా విధితమే. అసాధ్యం అనుకున్న తెలంగాణాను సుసాధ్యం చేసిన కేసీఆర్ నాయకుడైతే, విభజన హామీగా ఉన్న ప్రత్యేక హోదాను సాధించుకోలేకపోవడం ఏపీలో నాయకత్వ లేమి అన్నది సాధారణ జనం భావన. కేసీఆర్ మాటల తీరు, ఆయన వైఖరి, ఆధ్యాత్మిక విధానం, రాజకీయ పంథా, ముక్కుసూటితనం ఇవన్నీ కూడా ఏపీ ప్రజలు కూడా ఆయన పట్ల అభిమానం పెంచుకోవడానికి కారణాలు. అందువల్లనే కేసీఆర్ అమరావతి రాజధాని శంకుస్థాపనకు వచ్చినపుడు జనం జేజేలు పలికారు. ఆయన తిరుపతి, విజయవాడలకు మొక్కులు తీర్చుకోవడానికి వచ్చినపుడు బారులు తీరారు. రెండవమారు గెలిచాక ఈ మధ్యనే విశాఖ శ్రీ స్వరూపానందేంద్రస్వామీజీని కలవడానికి వచ్చినపుడు కూడా స్థానిక ప్రజానీకం నీరాజనం పలికారు. ఆ విధంగా చూసినపుడు కేసీఆర్ పట్ల ఏపీ ప్రజలు బాగానే అభిమానం చూపుతున్నారన్నది అర్ధమవుతోంది. ఇక, కేసీఆర్ జగన్‌తో కలసి ఫ్రంట్ కట్టడం పట్ల జనాభిప్రాయం ఎలా ఉంటుందని ఆలోచన చేసినపుడు ఇది మంచి పరిణామమేనని అనేవారూ ఉన్నారు. ఇదంతా రాజకీయమని భావించేవారూ ఉన్నారు. నిజానికి ఈ ఫ్రంట్ వల్ల జగన్‌కు ఏమి లాభం అన్నది కూడా ఆలోచన చేయాలి. ఏపీలో జగన్‌కు జనాదరణ పుష్కలంగా ఉంది. చంద్రబాబును ఆయన గత పదేళ్లుగా ఒంటరిగానే ఎదిరించి పోరాడుతున్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీ విజయం ఖాయమని దాదాపుగా వచ్చిన అనేక సర్వేలు తేటతెల్లం చేశాయి. అయితే, ఇపుడు జగన్ కేసీఆర్ కలవడం వల్ల అదనపు లాభం ఏదైనా ఉందంటే అది జగన్ రాజకీయంగా ఏకాకి కాదన్న సందేశం జనాలకు చేరడం, అంతే కాదు, అనుభవశాలి అయిన కేసీఆర్ పక్కన ఉండడం వల్ల జగన్ పట్ల ఏపీ జనం నమ్మకం మరింతగా పెరగడం, రాజకీయంగా చంద్రబాబును తట్టుకునే వ్యూహాలను జగన్ మరింతగా పదును పెట్టేందుకు అవకాశం ఉండడం, కేసీఆర్ అభిమాన జనం ఏపీలో ఉంటే వారు జగన్ వైపుగా మళ్లేందుకు వీలు కలగడం, ఇక, తెలంగాణానే సాధించిన కేసీఆర్ సహకారంతో ప్రత్యేక హోదాను ఏపీకి జగన్ తేగలడన్న విశ్వాసం పెంపొందడం, కేసీఆర్ సామాజికవర్గంతో పాటు, ఆయన ఫ్రంట్‌లో ఉన్న మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీ, మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్ వంటి వారి సామాజిక వర్గాల ఓట్లు వైసీపీ వైపుగా మళ్లేందుకు ఆస్కారం ఉండడం, తెలంగాణాలో టీఆర్ఎస్ సర్కార్ అధికారంలో ఉండడం వల్ల నిధులకు కూడా వైసీపీకి లోటు లేకుండా ఉండడం, ఇలా చెప్పుకుంటే ఇవన్నీ వైసీపీకి లాభాలుగా చూడాలి. ఇక, నష్టాలు కూడా ఉన్నాయి. అవేంటంటే కేసీఆర్‌ను ఆంధ్ర ద్రోహిగా చంద్రబాబు అండ్ కో ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ కాలం నాటి విషయాలను తవ్వి తీస్తున్నారు. ఆంధ్రులను నానా తిట్లు తిట్టిన వాటిని ఇపుడు బయటకుతెస్తున్నారు. అయిదేళ్ల పదవీకాలంలో ఏపీకి సాగునీటి ప్రాజెక్టులను కేసీఆర్ అడ్డుకుంటున్నారని గట్టిగా ప్రచారం చేస్తున్నారు. వీటితో పాటు ఆంధ్ర సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారు. మరి, ఇవన్నీ కూడా జగన్‌కు ఇబ్బందికరమైనవే. రేపటి రోజున ఏపీలో జగన్ గెలిస్తే కేసీఆర్ ఏపీలో పెత్తనం చేస్తారని, పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తి కాకుండా ఆగిపోతాయని చంద్రబాబు అండ్ కో చేస్తున్న ప్రచారం వైసీపీకి తీవ్ర నష్టాన్ని చేకూర్చేదే. మరి దీనికి జగన్ ఏ విధంగా అడ్డుకుంటారన్నది కూడా చూడాలి. అయితే, చంద్రబాబు సైతం కేసీఆర్‌తో పొత్తులకు వెంపర్లాడిన వైనాన్ని ఇపుడు వైసీపీ నేతలు బయటకు తీస్తున్నారు. అమరావతి శంకుస్థాపనకు కేసీఆర్‌ను పిలిచి ఘన స్వాగతం పలికింది చంద్రబాబు కాదా అని నిలదీస్తున్నారు. కేసీఆర్ యాగం నిర్వహిస్తే చంద్రబాబు హాజరైన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. మరి వీటిలో నిజానిజాలు ఎంతవరకూ జనాలకు వెళ్తాయో ఇపుడే చెప్పలేం. ఇదిలా ఉండగ, తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాలుగా అయిదేళ్ల క్రితం విడిపోయినా అంతా తెలుగు వారే. ఉమ్మడి రాష్ట్రంగా నలభై రెండు ఎంపీ సీట్లతో ఢిల్లీలో ఒకనాడు కీలకంగా వ్యవహరించిన తెలుగు వారు ఇపుడు ముక్కలయ్యారు. ఫలితంగా జాతీయ రాజకీయాలలో బలం కోల్పోయారు. కేసీఆర్ జగన్ ఆ దిశగా కలవడం ద్వారా మళ్లీ తెలుగు వారి వాణి హస్తినలో గట్టిగా వినిపించే అవకాశం ఉంటుంది. ఇక, మాజీ ప్రధాని వాజ్‌పేయి చెప్పినట్లుగా పొరుగు వారిని మనం ఎప్పటికీ మార్చలేం, వారితో స్నేహ సంబంధాలు పెంచుకుని సమస్యలను పరిష్కరించుకోవడం అనివార్యం. అలా చూసుకుంటే గత అయిదేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాలలో సామరస్యపూరితమైన వాతావరణం కనిపించలేదు. ఇద్దరు చంద్రుల మధ్య వివాదాలే ఎపుడూ హైలెట్ అయ్యాయి తప్ప, కీలకమైన అనేక సమస్యలకు పరిష్కారం దొరకలేదు. దానికి ఇద్దరి మధ్యన ఇగోలే కారణమంటారు. ఇపుడు జగన్, కేసీఆర్‌ల మధ్య కెమిస్ట్రీ వర్కవుట్ అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది, అదే విధంగా, జాతీయ స్థాయిలో విభజన హామీల కోసం గట్టిగా గొంతెత్తి పోరాడేందుకు కూడా వీలు కలుగుతుంది. దీన్ని రాజకీయకోణం నుంచి కాకుండా అభివృద్ధి కోణం వైపుగా జనం చూస్తే మాత్రం ఈ కాంబినేషన్ హిట్ అవుతుంది. ఆ విధంగా జనాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైసీపీపైన ఉంది. అదే సమయంలో టీడీపీ అరోపణలను తిప్పికొట్టే రాజకీయ నైపుణ్యమూ ఆ పార్టీకి ఉండాలి. లేకపోతే మాత్రం ఇది వృథా ప్రయోగమే అవుతుంది.

ముసుగు తొలగింది

(మొదటిపేజీ తరువాయి)

కుతంత్రాలు పన్నుతున్నారని, తిరిగి కేంద్రంలో బీజేపీ రావాలన్నదే వారిద్దరి ఆశయమని విమర్శలు గుప్పించారు. బీజేపీ అజెండాను అమలు చేసేందుకే ఫెడరల్ ఫ్రంట్ ను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దేశంలో పార్టీలను గందరగోళ పరిచి, ప్రజల్లో అయోమయం పెంచడమే వీరి లక్ష్యమని దుయ్యబట్టారు. ఏపీకి హోదా ఇస్తే, తెలంగాణకు కూడా ఇవ్వాలని కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసిన చంద్రబాబు, షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లోని సంస్థల విభజనకు అడ్డం పడ్డారని మండిపడ్డారు. ఆఖరుకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా కేసీఆర్ అమలు చేయనివ్వలేదని వ్యాఖ్యానించారు. విభజన చట్టంలోని అంశాలు అమలు చేస్తారా? సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయమని చెబుతారా? పోలవరం ప్రాజెక్టుకు అడ్డం పడకుండా ఉంటారా? ఏపీకి ప్రత్యేక హోదాకు అడ్డురాకుండా ఉంటారా? ఈ ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. కనీసం జగన్ అయినా, కేసీఆర్ ను ఈ ప్రశ్నలు అడిగి సమాధానాలను తెలుసుకుని ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీపై షర్మిల ఫిర్యాదు చేయడం దురదృష్టకరమని, సోషల్ మీడియాను దుర్వినియోగం చేసింది వైకాపాయేనని చంద్రబాబు నిప్పులు చెరిగారు. సీబీఐ జేడీ లక్ష్మీ నారాయణను లక్ష్యంగా చేసుకుని వైసీపీ దుష్ప్రచారం సాగించిందని, అసభ్య ప్రచారం చేసిందని వ్యాఖ్యానించారు.

కొలువు తీరిన తెలంగాణా అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

బానోతు హరిప్రియ పిన్న వయస్కురాలు. తెలంగాణ అసెంబ్లీలో మొత్తం 119 శాసనసభ స్థానాలకు గాను 88 మంది తెరాస సభ్యులు, కాంగ్రెస్ పార్టీ 19, మజ్లిస్ పార్టీ 7, తెదేపా 2, భాజపా తరపున ఒక సభ్యుడు ఉన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల్లో నలుగురు వేర్వేరు చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించిన వారు ఉన్నారు. మేడ్చల్ నుంచి ఎన్నికైన మల్లారెడ్డి, చెన్నూరు నుంచి గెలిచిన బాల్క సుమన్ లోక్‌సభ సభ్యులుగా పనిచేశారు. మునుగోడు నుంచి ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో లోక్‌సభ, శాసనమండలికి ప్రాతినిథ్యం వహించారు. కొడంగల్ నుంచి గెలుపొందిన పట్నం నరేందర్‌రెడ్డి కూడా మండలి సభ్యుడిగా పనిచేశారు. ఈనలుగురిని మినహాయిస్తే మిగతా 23 మంది మొట్టమొదటి సారి శాసనసభకు ఎన్నికయ్యారు. తెలంగాణ తొలి అసెంబ్లీలో లేని, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రాతినిథ్యం వహించిన 16 మంది ఈమారు మళ్లీ ఎన్నికయ్యారు. మొదటి శాసనసభకు నామినేట్ అయిన స్టీఫెన్‌సన్ మళ్లీ నామినేట్ అయ్యారు.

స్పీకర్‌గా పోచారం

తెలంగాణ అసెంబ్లీ 2వ శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న వేళ తెలంగాణ రెండో శాసనసభాపతిగా బాన్సువాడ శాసనసభ్యుడు, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి(69) ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది. పోచారం పేరు ప్రకటించి, ఆయనతో నామినేషన్ దాఖలు చేయించేందుకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ పోచారంతో మాట్లాడినట్టు సమాచారం. శాసనసభ్యునిగా అనుభవం, వాక్పటిమ ఉన్న పోచారం సభను సమర్థంగా నిర్వహించగలరని కేసీఆర్ ఈ ఆలోచన చేసినట్టు సమాచారం. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన పోచారం శాసనసభకు ఆరోసారి ఎంపికయ్యారు. వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. వయస్సు, ఆరోగ్యపరమైన సమస్యలను ఆయన సీఎం దృష్టికి తెచ్చినా.. వాటిపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని సీఎం భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఒకవేళ పోచారం వచ్చే ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయంగా ఆయన కుమారుడికి అవకాశం ఇచ్చేందుకు కూడా సీఎం హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఒకవేళ పోచారం కానిపక్షంలో పద్మాదేవేందర్‌రెడ్డి (మెదక్), ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్)లలో ఒకరు ఖరారు అవుతారని తెలుస్తోంది. పోచారంకు ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉండాలని పద్మాదేవేందర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిలకూ సీఎం ఇప్పటికే చెప్పినట్లు తెలిసింది. శాసనసభాపతి పదవిని ఏకగ్రీవం చేసేందుకు ట్రై చేస్తున్న కేసీఆర్ ఈ మేరకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు ఇప్పటికే విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

పడగవిప్పిన పాత కక్షలు


(మొదటిపేజీ తరువాయి)

ధనరాజు, భీమిలి మండలం చిననాగమయ్యపాలెంకు చెందిన గరికిన సతీష్ హత్యకు గురికావడం, వీరిద్దరూ యువకులే కావడంతో పాటు, తీర ప్రాంత వాసులు కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే...గంగవరం గ్రామంలో కనుమ సంబరాలతో గ్రామం సందడిలో ఉంది. ఇదే అదునుగా పాతకక్షల నేపథ్యంలో పల్లి సురేష్ అనే యువకుడు అదే ప్రాంతంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న పేర్ల ధనరాజ్‌పై బీరుబాటిల్‌తో దాడి చేశాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. బీరు బాటిల్‌తో ధనరాజ్ పొట్టలోను, తలపైన తీవ్రంగా గాయపర్చడంతో పేర్ల ధనరాజ్ గాయాలకు గురై ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేర్ల ధనరాజు , పల్లి సురేష్‌తో గతంలో వివాదాలున్నట్టు చెబుతున్నారు. మద్యం మత్తులో సురేష్ బీరుబాటిల్‌తో ధనరాజ్‌పై దాడికి తెగబడ్డాడు. ఈ మేరకు న్యూపోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న సురేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ధనరాజ్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అలాగే గురువారంనాడు భీమిలి మండలంలో మరో యువకుడి హత్య జరిగింది. భీమిలి మండలం చిననాగమయ్యపాలెం గ్రామానికి చెందిన .గరికిన సతీష్(24)అనే యువకుడ్ని మద్యం బాటిళ్ల తో పొడిచి హత్య ఇద్దరు వ్యక్తులు అమానుషంగా హత్య చేశారు. చిననాగమయ్యపాలెం గ్రామానికి చెందిన గరికిన సతీష్, అఖిల్,నాని షిప్‌యార్డ్ ప్లాంట్‌లో కలిసి పనిచేస్తున్నారు. అయితే సంక్రాంతి పండగకని వీరు ముగ్గురు తమ స్వగ్రామానికి వచ్చారు. వీరి మధ్య ఎప్పటి నుంచో వివాదం కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. అదే సందర్భంలో ముక్కనము రోజున ఈ వివాదం మళ్లీ రేగడంతో స్నేహితుడని కూడా చూడకుండా అఖిల్,నాని ఒక్కటై అత్యంత అమానుషంగా బీరుబాటిల్‌తో దాడిచేసి హత్య చేయడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అంతవరకు పండగ సంబరాల్లో వున్న జనంకు ఈ సంఘటన కంటతడి తెప్పించింది. ఇది కూడా మద్యం మత్తులోనే జరిగింది. ఈమేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుగుమోత !!

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకొని చాలా మంది పండగ తరువాత తీరిగ్గా తమ తమ ఊర్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ముక్కనుమ రోజు (గురువారం) చాలా మంది బయల్దేరి వెళ్లారు. దీంతో అన్ని వాహనాలు అంప్ అండ్ డౌన్‌తో యమ రద్దీగా మారింది. అయితే ఈ సారి ప్రయాణం అత్యంత ఇబ్బందికరంగానే సాగిందని తెలుస్తోంది. ఏ ఒక్క బస్సు, రైలు ఖాళీగా కనిపించలేదు. చింతపండు బస్తాలు మాదిరిగా వాహనాల్లో ప్రయాణీకులు కిక్కిరిసిపోయారు. ఊపిరి కూడా ఆడడం లేదా ? అన్నట్టుగా సాగుతోంది వారి ప్రయాణం.. ఓవైపు పిల్లాపాపలు, మరోవైపు పెద్ద ఎత్తున లగేజీలతో ప్రయాణీకులు నానా అవస్థలు పడ్డారు. పలువురు ఫుట్‌పాత్‌లు, బస్సులపై వేలాడుతూ రాకపోకలు చేశారు. గమ్యస్థానం చేరేంతవరకు ప్రయాణీకులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవల్సి వచ్చింది. ముఖ్యంగా రాష్ట్రం ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు చేసేందుకు ప్రధాన కేంద్రం కావడంతో చాలా మంది ఇక్కడున్నవారితో పాటు, దూర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ హాల్ట్ జర్నీ చేయడంతో రద్దీ అంతా విశాఖలోనే కనిపించింది. ఇచ్ఛాపురం, అటు విజయవాడ, హైదరాబాద్ వైపు వెళ్లే రైళ్లలో విపరీతమైన రద్దీ కనిపించింది. విశాఖ నుంచి విజయనగరం, రాయపూర్ , పలాస, కోర్బా, దుర్గ, భువనేశ్వర్, సికింద్రాబాద్, కోరాపుట్ తదితర ఎక్స్‌ప్రెస్, ప్యాసింజరు రైళ్లు విశాఖ



స్టేషన్‌లోనే కిక్కిరిసి రావడంతో ఇక్కడి స్టేషన్‌లో ఎక్కడానికి యాత్రికులు, ప్రయాణికుల అవస్థలు పడ్డారు. ముఖ్యంగా విశాఖ ప్రధాన రైల్వేస్టేషన్, దువ్వాడ, సింహాచలం స్టేషన్‌లు వద్ద రద్దీ అత్యంత రద్దీగా మారింది. చాలా మంది సింహాచలం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏది ఏమైనా ఈ సారి పండగ ముందు, తరువాత కూడా పండగ ప్రయాణీకుల సందడి తగ్గలేదు. ప్రయాణీకులు చాలా వరకు అవస్థలు పడినా ఆర్టీసీ, రైల్వేశాఖలకు మాత్రం గణనీయమైన ఆదాయం లభించిందనే చెప్పాలి. మరో వైపు సందట్లో సడేమియా అన్నట్టు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రయివేటు ఆపరేటర్లకు ఈ సంక్రాంతి నిజమైన పండగ తెచ్చిందనే చెప్పాలి. సాధారణ రోజులు కంటే అదనంగా ప్రయాణీకుల నుంచి ఛార్జీలు వసూళ్లు చేసి, బియ్యం బస్తాల్లా ప్రయాణీకులను వాహనాల్లో కుక్కేసి వారి నుంచి సొమ్ములు గుంజేశారు. ఏది ఏమైనా కష్టమైనా, నష్టమైనా సంక్రాంతి పండగ మాత్రం అన్ని ప్రాంతాల్లో జోష్‌గానే సాగింది.

మళ్లీ బెలూన్ ఫెస్టివల్

(మొదటిపేజీ తరువాయి)

నెలలో నిర్వహించారు. కానీ, ఆదిలోనే అది తుస్సుమంది. సరైన వాతావరణం లేకపోవడంతో డబ్బుతో సహా, అన్నీ వృథా అయ్యాయి. అయినా సరే, పట్టువదలకుండా రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉత్సవాలను నిర్వహించాలనుకోవడం వెనక దుబారా తప్ప మరోటి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిజానికి ఏదో ఓ ఈవెంట్ నిర్వహించడం ద్వారా ఖజానాకు చిల్లుపెట్టడం తప్ప ప్రజలకు పనికివచ్చేదేమీఉండదని పర్యాటక ప్రియులు అంటున్నారు. శాశ్వతమైన ప్రాజెక్టు ఒకటీ కూడా చేపట్టకుండా ఇలా చిల్లరగా కోట్ల రూపాయలను వృథా చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలోనే విశాఖ ఉత్సవ్‌ను కోట్ల రూపాయలు పెట్టి నిర్వహించారు. ఆ తరువాత సంక్రాంతి సంబరాలు అంటూ ప్రతీ జోన్‌కీ లక్ష రూపాయలు వంతున ఖర్చు పెట్టారు. ఇపుడు అరకులో బెలూన్ ఫెస్టివల్ అంటున్నారు. ఇలా దుబారా చేయడం ఇపుడున్న ఆర్ధిక పరిస్థితులలో తగునా అన్న చర్చ సాగుతోంది.

అస్మదీయులైన ఈవెంట్ నిర్వాహకులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసమే ఇదంతా చేస్తున్నారని కూడా అంటున్నారు. నిజానికి ఈ ఉత్సవాల వల్ల స్థానికంగా పర్యాటకరంగానికి కూడా పెద్దగా మేలు చేకూరే అవకాశాలు లేవని కూడా ఆరోపిస్తున్నారు. ఇక, ఈ బెలూన్ ఫెస్టివల్ కోసం పదిహేను దేశాల నుంచి ప్రతినిధులను రప్పిస్తున్నారు. వారి కోసం నానా హంగామా చేయడంతో పాటు, ప్రభుత్వ యంత్రాంగం కూడా బిజీ అవుతోంది. అసలే పుణ్యకాలం తక్కువగా ఉంది, అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు నిధులు లేవంటన్న ప్రభుత్వ పెద్దలు ఇలా ఉత్సవాలు జరుపుకోమంటూ డబ్బులు వృథా చేయడమేంటని విపక్షాలు గుస్సా అవుతున్నాయ.

అండమాన్ నికోబార్లో భూకంపం

పోర్ట్ బ్లెయిర్: అండమాన్ నికోబార్లో భూకంపం సంభవించింది. నికోబార్ ద్వీపాల్లో గురువారం ఉదయం సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.0గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మోలజీ వెల్లడించింది. ఉదయం 8.43 సమయంలో భూమి కంపించినట్లు తెలిపింది. నికోబార్ ద్వీపాల ప్రాంతంలో బంగాళాఖాతం సముద్రంలో 84కిలోమీటర్ల లోతులో భూకంపం వచ్చినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఆస్తి, ప్రాణ నష్టం గురించిన వివరాలు తెలియరాలేదు.

మందు..చిందు తప్పులేదు



న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని డ్యాన్స్ బార్లకు ఊరట కలిగించే తీర్పు వెలువరించింది సుప్రీంకోర్టు. డ్యాన్స్ బార్లపై అక్కడి ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలను కొట్టేసింది. బార్లలో మందు, చిందు కలిసి నడవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని డ్యాన్స్ బార్లు ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలకు కనీసం కిలోమీటరు దూరంలో ఉండాలన్న నిబంధనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ముంబైలో ఇది కుదరదని, దీనిపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలని కోర్టు అభిప్రాయపడింది. బార్లలో సీసీటీవీలు కచ్చితంగా ఉండాలన్న ప్రభుత్వ నిబంధనను కూడా కోర్టు కొట్టేయడం విశేషం. ఇక ఈ బార్లలో డ్యాన్స్ చేసే వారికి టిప్స్ ఇవ్వాలి తప్ప.. వాళ్లపై డబ్బు వెదజల్లకూడదని కూడా కోర్టు తేల్చి చెప్పింది. అంతేకాదు బార్ రూమ్స్, డ్యాన్స్ ఫ్లోర్ మధ్య గోడ ఉండాలన్న నిబంధనను కూడా సుప్రీం కొట్టేసింది. ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలకు కిలో మీటర్ దూరంలో బార్లు ఏర్పాటు చేయాలన్న నిబంధనను సవాలు చేస్తూ ఈ బార్ల యజమానులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పెద్ద పెద్ద నగరాల్లో ఇది కుదరదని వాళ్లు వాదించారు. 2016లో ఈ డ్యాన్స్ బార్లపై కఠిన నిబంధనలు విధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం తీసుకొచ్చింది. డ్యాన్స్ చేసే ప్రదేశాల్లో మద్యం సరఫరా ఉండకూడదని, బార్లు రాత్రి 11.30 గంటలకల్లా మూసివేయాలన్న నిబంధనలు ఇందులో ఉన్నాయి.

పడవ బోల్తా.. ఇద్దరు యువకులు మృతి

పశ్చిమ గోదావరి : పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల శివారు చెరువులో గురువారం పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. చనిపోయిన ఇద్దరు యువకులు తాడిగడప రమేష్ (29), కిషోర్ (23) లుగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుండెల్లో రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

హత్యారాజకీయాలు చేస్తున్నాడని సాక్షాత్తూ జగన్మోహనరెడ్డి ఆరోపణలు చేశారు. హర్షవర్ధనచౌదరికి అత్యంత ఆప్తుడిగా వున్న వెలగపూడి ఈ కోడికత్తి కేసులో కీలకం అయ్యే అవకాశముందని వైసీపీనేతలు ఆరోపిస్తున్నారు. నోటీసులు అందుకున్న వారంతా ఇప్పటికీ భయాందోళనలతో ఉన్నారు. దాంతో, ఎన్ఐఏకు వివరణ ఇవ్వాల్సిన విషయంలో కొంత ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. రాష్ట్ర దర్యాప్తుసంస్థ తూతూమంత్రంగా విచారణ చేసి హర్షవర్ధన్‌ని సిట్ ఆఫీసుకి పిలిచి కాఫీ, టీ ఇచ్చి గౌరవించి పంపేశారనే ఆరోపణలున్నాయి. హర్షవర్ధన్ ని అదుపులోకి తీసుకుని విచారణ చేసిననంతరం మరిన్నీ తీవ్రమైన అంశాలు వెలుగులోకి వస్తాయని పలువురు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఎన్ఐఏ దర్యాప్తును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. వైసీపీనేతలతో పాటు బీజేప ఎంపీ జీవీఎల్ నరసింహారావు వంటివారు బహిరంగంగానే ఈవిషయంలో ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారు. కిడారి, సివేరీ సోమా హత్యకేసుల్లో ఎన్ఐఏ విచారణ కోరిన ముఖ్యమంత్రి జగన్ కేసులో ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే ఇది రాష్ట్రపరిధిలోకి రాదని విమానశ్రయంలో జరిగింది కాబట్టి కేంద్రపరిధిలోకి వస్తుందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు బాహాటంగా ఎన్ఐఏ ను వ్యతిరేకించడంతో ఎన్ఐఏ దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారింది. ఈవిషయమై మాజీకార్పొరేటర్ శ్రీధర్ స్పందిస్తూ ఎన్ఐఏ కి సహకరించడానికి ఎల్లప్పుడూ సిద్దంగా వుంటానన్నారు. జగన్ ఎప్పుడూ విశాఖ విమాశ్రయానికి వచ్చినా తన ఇంటివద్ద తయారుచేసిన కాఫీ ఇచ్చేవాడినని, అయితే ఎయిర్‌పోర్టు సిఎస్‌వోగా పనిచేస్తున్న వేణుగోపాల్ తనను అడ్డుకుని బయటినుంచి కాఫీ తీసుకురాకూడదని ఆంక్షలు విధించారన్నారు. అప్పటినుంచి ఎయిర్‌పోర్టు క్యాంటీన్ నుంచే జగన్‌కి కాఫీ, టీ, వాటర్ అందిస్తామని చెప్పటంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ నోటీసులు అందుకున్న వారి విచారణ అనంతరం ఏమి జరగబోతోందని పలువురు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

సంచలన వార్తా పత్రిక
లీడర్ విశాఖపట్నం సిటీ 3

విశాఖపట్నం శుక్రవారం 18-1-2019

మీ'సేవ'లు బంద్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వాహకులు సమ్మెబాట

విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడే నిలిచిపోయిన సేవలు

ఉద్యోగభద్రత, కమీషన్ తదితరాలు పెంచాలంటూ డిమాండ్

సమ్మె కొనసాగితే... పౌర సేవలకు మరింత అంతరాయం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ఎప్పటికప్పుడు పౌర సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న మీ'సేవ' కేంద్రాల నిర్వాహకులు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి సమ్మె సైరన్ మోగించారు. చాలా కాలంగా తమ డిమాండ్లు పరిష్కారంలో ప్రభుత్వం చూపెడుతున్న నిర్లక్ష్యం, పని భారం పెంచడంతో తాము పడుతున్న అవస్థలను పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ నిర్వాహకులు ఆందోళకు దిగారు. పౌర సేవల సరళీకరణకు చేపట్టిన మార్పుల్లో భాగంగా మీ సేవ నిర్వాహకులకు పెనుభారంగా మారింది. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందే ప్రతీ పౌర సేవను ప్రభుత్వం ఒక్కొక్కటిగా మీ సేవా కేంద్రాలకే అప్పగిస్తూ రావడం, దీంతో మీ సేవా నిర్వాహకులకు కూడా పనిభారం పెరుగుతున్న సంగతి తెలిసిందే. చాలీచాలని కమిషన్, ఉద్యోగ భద్రత లేకపోవడం, ఆన్‌లైన్ పద్దతిలో చేయాల్సిన పనులను తిరిగి మాన్యువల్‌కు మార్చడం వంటి విధానాలను వ్యతిరేకిస్తున్న సదరు కేంద్రాల నిర్వాహకులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుగా ఆందోళన బాట పట్టారు. ఏపి ఆన్‌లైన్, శ్రీవెన్, రామ్‌ఇన్‌ఫ్లో, కార్వీ, సిఎంఎస్ తదితర కంపెనీలు వీటికి సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నాయి. మీ సేవ కేంద్రాల్లో అందించే పౌర సేవలకు ఈ కంపెనీల ద్వారా కమీషన్ అందుతుంది. కేటగిరి-ఎ కింద రూ.11 నుంచి 12.90 వరకు చెల్లిస్తుండగా కేటగిరి-బి కింద రూ.17 నుంచి రూ.18.50 కమీషన్ చెల్లిస్తున్నారు. అలాగే మీ సేవ నిర్వాహకులే స్టేషనరీ ఖర్చులు భరించాల్సి ఉంటుంది. దీంతో నిర్వాహకులకు తలకుమించిన భారంగా మారింది. దీంతో ఏపి జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసి) పిలుపు మేరకు మీ సేవ నిర్వాహకులు సమ్మెలోకి దిగారు. ప్రతీ మీ సేవ కేంద్రంలో పని చేసే నిర్వాహకునికి కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనం రూ.18,500 చెల్లించాలని, కేటగిరి-ఎకు రూ.25, కేటగిరి-బికు రూ.30 కమీషన్ పెంచి ఆపరేటర్‌కు కనీస ఆదాయం వచ్చేలా చూడాలని కోరుతున్నారు. అంతేకాకుండా కమీషన్లు పెంచినా కొంత మంది గ్రామీణ ప్రాంతాల ఆపరేటర్లకు ప్రభుత్వం కనీస భృతిని రూ.15వేలు చెల్లించాలని, 2012 నుంచి అమలు చేస్తున్న రెండు రూపాయల స్కానింగ్ చార్జీలను ఐదు రూపాయలకు పెంచాలని, ప్రస్తుతం వసూలు చేస్తున్న 18శాతం జీఎస్టీని మినహాయించాలని, ఆపరేటర్ మృతి చెందితే సదరు కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, కొత్త సెంటర్లు ఇచ్చినప్పుడు పక్క పక్కనే కాకుండా పరిధి పాటించాలని, ఉద్యోగ భద్రత పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి దిగినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. కాగా మీ సేవలు మూతపడటంతో ప్రజలకు సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఇదిలావుండగా మీసేవా కేంద్రాలు తొలి రోజు సమ్మెతోనే జిల్లావ్యాప్తంగా ప్రజలు అనేక అవస్థలు పడ్డారు .సంక్రాంతి తదితరాలతో వరుస శెలవులు కావడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి అందాల్సిన పౌర సేవలకు ఇటీవల అంతరాయం కలిగింది. దీంతో చాలా మంది గురువారం నాడు తమ పనులు చక్కబెట్టుకోవచ్చునని భావించినప్పటికీ, మీసేవా కేంద్రాల నిర్వాహకులు సమ్మె చేయడంతో చాలా వరకు పనులు స్థంభించిపోయాయి. ముఖ్యంగా విద్యుత్ బిల్లులు, వివిధ పన్నులు, పలు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు, పలు సర్టిఫికేట్లు ,అర్జీలు తదితర అనేక దరఖాస్తుల్లో పెండింగ్‌లో పడ్డాయి. అంతకుముందు దరఖాస్తులు చేసుకున్నవారి పనులు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయి. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు వున్నవారికి ఈ సమ్మె తీవ్రమైన ప్రభావం చూపిందనే చెప్పాలి. దాదాపు ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు మీ సేవాద్వారానే జరగాల్సి వుండడం, నిర్వాహకులు సమ్మె నిర్వహించడంతో పౌర సేవలు అస్తవ్యస్తంగా మారే ప్రమాదం వుందని, ప్రభుత్వం స్పందించి మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో చర్చలు జరపి సమస్య సానుకూలంగా పరిష్కారం అయ్యే విధంగా దోహదపడాలని, లేదంటే సమ్మె ఇలాగే కొనసాగితే, ఈప్రభావం ప్రభుత్వంపై పడుతుందని, దీనిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం కూడా లేకపోలేదని పలువురు హితవు పలుకుతున్నారు.

మూడురోజుల్లో రూ.1200కోట్ల బెట్టింగ్

ఏరులైపారిన లిక్కర్ - కోడిపందేలు, గుళ్ళాట,పేకాట స్థావరాలుగా మారిన పల్లెలు



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడురోజుల్లో రూ.1200కోట్లు పందేల్లో చేతులు మారాయి. కోస్తాంధ్రా, గోదావరీ జిల్లాలతో పాటు విజయవాడ గుంటూరు లలో నిషేదిత జూదక్రీడలన్నీ నిర్వహించారు. తీవ్రస్థాయిలో జూదం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో వందలకోట్లు చేతులు మారాయి. ముఖ్యంగా పశ్చిమగోదావరిజిల్లా భీమవరం, వీరవాసం, మైలవరం,తణుకు,కృష్ణాజిల్లా కైకలూరు,తూర్పుగోదావరి జిల్లా వి.కొత్తపల్లి, వేట్ల పాలెం, ఇరుపాక, పిఠాపురం, నాగులాపల్లి, గోకవరం, రంపచోడవరం తదితర ప్రాంతాలలో బారీగా పందేలు జరిగాయి.గుళ్ళాటలకు వేలం నిర్వహించగా ఒకప్రాంతంలో రూ.38లక్షలు పలకడం గమనార్హం. పేకాట, కోడిపందేలా స్తావరాలతో పల్లెలన్నీ జూదక్రీడాప్రాంగణాలుగా మారిపోయాయి.స్థానిక రాజకీయనాయకుల అండదండలతోజూదక్రీడలు నిర్వహించడం వలన పోలీసులు స్థావరాలపై దాడులుచేయలేకపోయారు. పండుగ కావడంతో ఉదయం 7గంటలనుంచే కోడిపందేలు ప్రారంభమయ్యాయి. పల్లెల్లో జూదరులు రాకతో కార్లతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖ, హైదరాబాదు, విజయవాడ, బెంగుళూరు, చెన్నయ్ తదితర దేశ వ్యాప్తంగా స్థిరపడిన స్థానికులంతా పల్లెలకు రావడంతో పల్లెల్లో పట్టణ వాతావరణం కనిపించింది. థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా వంటి ఇతరదేశాల నుంచి కోళ్ళను తెప్పించి కాకినాడలో పందెంబరిలో దింపారు. మొట్టమొదటిసారిగా విదేశీకోళ్ళను పోటీలో వుంచడంతో పోటీలు తిలకించేందుకు జనం పోటెత్తారు. నేషనల్ హైవే టోల్‌ప్లాజాల వద్ద తీవ్ర ట్రాఫిక్‌జామ్ జరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17తేదీ వరకూ టోల్‌ఫీజులు వసూలుచేయవద్దని ఆదేశాలు చేసినప్పటటికీ టోల్‌నిర్వాహకులు బేఖాతరుచేసి వసూళ్ళకు పాల్పడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నిర్వాసితుల పోరాటానికి అండగా ఉంటా...

జనసేన నాయకుడు చింతలపూడి



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: తమ సమస్య పరిష్కారంకోరుతూ శీకువానిపాలెం గ్రామానికి చెందిన నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి అండగా వుంటానని గాజువాక మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. 52 వ వార్డులోని శీకువానిపాలెం గ్రామ నిర్వాసితులు చేస్తున్న నిరసన దీక్షలో గురువారం చింతలపూడి పాల్గొని సంఘీభావం తెలిపారు. దాదాపు 2 ఎకరాలు స్థలంలో నిర్వాసితుల అవసరాలు నిమిత్తం వున్న స్థలంలో జీవీఎంసీ అధికారులు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేసి, స్థానికులకు వ్యతిరేకంగా ఆ స్థలంలో డ్రై రీసోర్స్ సెంటర్‌ను ప్రారంభించడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కింద ఉపయోగించడం, దీనిపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్థానికుల ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.తమ విన్నపాలను అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వాసితులకు దీక్షలకు దిగారు.ఈమేరకు గత 16 రోజులుగా దీక్ష కొనసాగుతోంది. దీక్షకు సంఘీభావం తెలిపిన చింతలపూడి నిర్వాసితుల పోరాటానికి తన సంపూర్ణ మద్దతు వుంటుం దన్నారు. జీవీఎంసీ మొండి వైఖరి విడనాడాలన్నారు. సంఘీభావం తెలిపినవారిలో డీపీఆర్ చందు, పరందామయ్య, తులసీదాస్, సాధురెడ్డి, గొందేశి ఎరుకునాయుడు, కడవల తాతబ్బాయి, గాజువాక నియోజకవర్గం 51,52 వార్డులకు చెందిన గ్రామ పెద్దలు జీలకర్ర రమణ, అండిబోయిన రత్నం, సారిపల్లి ప్రభ, జీలకర్ర భువనేశ్వరి దేవి, కడవల సింహాచలం, నిర్వాసిత గ్రామాలకుచెందిన రెండు వార్డుల మహిళలు, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి భరోసా

దక్షిణ ఎంఎల్ఏ వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: అనారోగ్యం బారినపడితే ఆందోళన చెందకుండా తనను సంప్రదించాలని వైద్యం, మందుల ఖర్చులు తానే చూసుకుంటానని దక్షిణ నియోజకవర్గం ఎం ఎల్ఏ వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గం పేదలకు భరోసా కల్పించారు.పేదల వైద్యానికి సిఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అంది స్తామన్నారు. విశాఖ దక్షిణం26వ వార్డులోని అనారోగ్యం బారిన పడిన పేదలను ఆయన కలిశారు. వైద్యం ఖర్చులకోసం సిఎం సహాయ నిధి చెక్కులను గురువారం బాదితులకు అందజేశారు. ఈ విధంగా ఇప్పటివరకు.. దక్షిణ నియోజకవర్గంలోని పేదలవైద్యం కోసం రూ.9.86 కోట్లు అందించడం జరిగిం దని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఎవరైనా అనా రోగ్యం బారిన పడితే ఆందోళన చెందవద్దని సూచించారు. వైద్యం, మందులఖర్చులకు కలత చెందవద్దన్నారు. ఒక్క పోన్ చేసి వివరాలు తెలియజేస్తే.. వైద్యం, మందులు అన్నీ ఖర్చులుతామే చూసు కుంటామన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే ,పరిస్థితి ప్రమాదకర స్థాయిలోవుంటే వెంటనే దగ్గర్లోవున్న ఆసుపత్రిలో తీసుకువెళ్లాలన్నారు. తర్వాత పోన్ చేసి సమాచారం అందించాల న్నారు. వైద్యం, మందులఖర్చుల రశీదులు భద్రప రిచి వాటిని తమకు అందజేస్తే సిఎం సహాయనిధి ద్వారా ఖర్చుపెట్టిన డబ్బునుతిరిగి వారికి అంద జేస్తామని వివరించారు. సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రామిరెడ్డి, పిల్లిరమణ, చిన రెహమాన్, నాయన రాజారెడ్డి, ఫైయూజ్ రెహమాన్, సూరి అప్పా రావు, యర్ర అప్పారావు, జప్పుల్లా, సత్యవతి, అప్పన్న తదతరులు పాల్గొన్నారు.



స్వచ్ఛసర్వేక్షన్-2019కు సన్నద్ధం కండి

సమీక్షా సమావేశంలో కమిషనర్ హరినారాయణన్

విశాఖపటం,న్యూస్‌లీడర్ : స్వచ్ఛ సర్వేక్షన్-2019లో అధికారులు సమాయుత్తం కావాలని, నగర ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా ఈ ఏడాది ఫస్ట్ ర్యాంక్ సాధించే దిశగా అడుగులు వేయాలని జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. జీవీఎంసీసమావేశ మందిరంలో గురువారం సంబంధిత శాఖల అధికారు లతో కమిషనర్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా స్వచ్ఛ సర్వేక్షన్-2019కు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలుసూచనలు చేశారు. జీవీఎంసీఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోను ఈ సారి ప్రథమ స్థానం మిస్‌కాకూడదని సూచించారు. జీవీఎంసీకి అన్ని అర్హతలున్నప్పటికీ, ర్యాంక్ విషయంలో వెనుకబాటుకు గల కారణాలను పునరాలోచించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి, ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. కళాజాతాలు, వివిధ రూపాల్లో ప్రచారం సాగించాలన్నారు.అదే సందర్భం లో అభివృద్ధి కార్యక్రమాలు కూడా వేగవంతంగా తీర్చిదిద్ది ఆదర్శనీయమైన పనితీరు కనబరచాలని కోరారు.



ఎంఎస్ఎఫ్-2 ను పరిశీలించిన కమిషనర్

నగరంలో ఎంఎస్ఎఫ్-2 పనుల ను సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ హరినారాయణన్ గురువారం ఉదయం పరిశీలించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా కైలాసగిరి తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటిం చారు.ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్-2 పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కైలాసగిరి, ఆర్‌కేబీచ్ లోని వైఎంసీఏ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించారు.వీటి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.,

అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి



విశాఖపట్నం,న్యూస్‌లీడర్: నగరంలో కనుమ పండుగ రోజున గురువారం విషాథం చోటుచేసుకుంది. అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా పనిచేసిన సప్పా అప్పలరాజు ఆందోళన తట్టుకోలేక మృతి చెందారు. ఈయన ఆరేళ్లుపాటు అగ్రిగోల్డ్ డీఎం కార్డ్ హోదాలో అగ్రిగోల్డ్ సంస్థకు సేవలు అందించారు. ఎంతో నమ్మకంతో తమ మిత్రులు, బంధువులు, తెలిసి నవారందరిచేత డిపాజిట్లు పెద్ద మొత్తంలో కట్టించారు. అయితే పండగ సందర్భంగా అప్పలరాజుపై ఒత్తిడి పెరగడం, ఇంత వరకు అగ్రిగోల్డ్ విషయం ఎటూ తేలకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై అప్పలరాజు మృతి చెందినట్టు చెబుతున్నారు. మృతుడు అప్పలరాజు వన్ టౌన్ శ్రీ వాసవి కళ్యాణ మండపం పక్కన నివాసముంటున్నారు.

6 తులాల మంగళసూత్రం అపహరణ

గాజువాక, న్యూస్‌లీడర్: స్కూటర్‌పై వెళ్తున్న మహిళ మెడలోని 6 తులాల బంగారు మంగళ సూత్రాన్ని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తెంచుకెళ్లారు. ఈసంఘటన గురువారం మద్యాహ్నం రాజీవ్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని ఉడా కాలనీలో జరిగింది. శెచెట్టి సత్యవాణి భర్తతో కలిసి స్కూటర్‌పై కూర్మన్నపాలెం స్టీల్ కో ఆప్‌స్టోర్స్‌కు వెళ్తుంది. ఉడా కాలనీలో ఎదురుగా మోటారు సైకిల్‌పై వస్తున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తెంచికెళ్లారు. ఆమె కేకలు వేసినప్పటికీ ప్రయోజనం లేదు. ఈ మేరకు సత్యవాని దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా పరిశోధన ప్రారంభించారు. చైన్ స్నాచర్స్ తలపై క్లాత్ టోపీని ధరించి ఉన్నారు. సంఘటనా స్థలికి ఏసీపీ ప్రేమా కాజోల్ క్రైం పోలీసులు చేరుకుని అనుమానాస్పంద వ్యక్తుల్ని ప్రశ్నిస్తున్నారు.

ఆంధ్రాబాప్టిస్ట్ చర్చిలో మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలి

చర్చివైస్ చైర్మన్ ఈశ్వర్రావు

విశాఖపట్నం,న్యూస్‌లీడర్: నగరంలో ఒన్ టౌన్ ఏరియాలో వున్న ఆంధ్రాబాప్టిస్టు చర్చిలో ఇటీవల జరిగిన ఎన్నికలు చెల్లవని తిరిగి మరలా ఎన్నికలు నిర్వహించాలని చర్చివైస్‌చైర్మన్ ఆర్ ఈశ్వర్రావు తెలిపారు. గురువారం చర్చి సభ్యులతో కలిసి వీజెఎఫ్‌లో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వతేదీన చర్చిచైర్మన్ ఇతర పదవులకు జరిగిన ఎన్నికల్లో వై బెన్నిబాబు వర్గం రౌడీయిజం, గూండాగిరి చేసి ఎన్నికల్లో గెలుపొం దారని ఆరోపించారు. చర్చిసభ్యులుగా సుమారు 700 మంది వున్నప్పటికీ అధికంగా నెంబర్లు కానివారు వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారని, 680 ఓట్లు పోలవ్వగా యాభైశాతం ఓట్లు బయటినుంచి వచ్చిన రౌడీలు వేసినవేనని ఆరోపించారు. ఎన్నికల అధకారులైన ఈశ్వర్రావు, దయామణిలను బెదిరించా కౌంటింగ్‌కు అంతరాయం కలిగించార న్నారు. ఎన్నికల అధికారులు ప్రకటించకుండా బెన్నిబాబు తనకుతానే చైర్మన్‌గా ప్రకటించుకోవడం దారుణ మన్నారు. ఈఎన్నికలను రద్దుచేసి మరలా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నకల అధికారులను మీడియా, పత్రికా ముఖంగా కోరుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ధనలక్ష్మీ, బిల్డింగ్ కమిటీ కన్వీనర్ జి. శ్యామ్‌సుందర్, ట్రెజరర్ పిఎస్ ఏబినీజర్, కార్యధర్శి ఎస్ విజయబాబు, డీకన్లు సిహెచ్ తాత బాబు, ఎం దోరతీడేవిడ్ లు పాల్గొన్నారు.



సింహాచలం అప్పన్న ఆలయంలో ఘనంగా కనుమ ఉత్సవం




సింహాచలం, న్యూస్‌లీడర్: సింహాచలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా కనుమ రోజున అప్పన్న కొండ దిగువ పూల తోటలో వేడుక అత్యంత ఘనంగా జరిగింది. వరద రాజస్వామి అలంకారంతో నరసింహస్వామి దర్శన మిచారు. ఈ సందర్భంగా అడవివరం గ్రామంలో స్వామివారి తిరువీధి కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అప్పన్న స్వామిని తొలిపావంచా వద్ద పలువురు అధికార, అనధికార ప్రముఖులు స్వాగతం పలి కారు. స్వాగతం పలికినవారి లో వైసీపీ తూర్పు నియోజక వర్గం సమన్వయకర్త వంశీ కృష్ణ, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తది తరులున్నారు.

శారదపీఠంలో...

కనుమ పర్వదినం రోజున వైసీపీ తూర్పు నియో జకవర్గ సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ దంపతులు చినముషిడివాడలో గల శారదాపీఠంలో శ్రీ స్వామి స్వరూపానందేంద్ర స్వామి వారి ఆశీర్వదం పొందారు. అనంతరం స్వామివారు చేతులమీదుగా అమ్మవారి జ్ఞాపికను, అక్షింతలు స్వీకరించారు. అనంతరం సిం హాచలంలో అత్యంత వైభవంగా జరిగే సింహాద్రి అప్పన్న వారి పల్లకి సేవలో పాల్గొన్నారు. స్వామి వారి పల్లకిని కాసేపు మోసారు. దేవుని ఆశీర్వాదం పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

దయాల్ సేవలు చిరస్మరణీయం

ఎంపి టిఎస్ఆర్



దయాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న సుబ్బిరామిరెడ్డి

గాజువాక, న్యూస్‌లీడర్: గాజువాక ప్రాంతానికి దయాల్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు, సబార్డినేట్ లెజిస్లేటివ్ పార్లమెంట్ కమిటీ చైర్మన్ టి సుబ్బిరామిరెడ్డి అన్నారు. దయాల్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి పెదగంట్యాడలో నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఉక్కు నిర్వాసితుల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి దయాల్‌రెడ్డి అన్నారు. అంతకు ముందు సుబ్బిరామిరెడ్డి దయాల్ విగ్రహానికి పూలమా ల వేసి ఘనంగా నివాళులర్పించారు. దయాల్‌రెడ్డికి నివాళులర్పించిన వారిలో ఉక్కు చైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ పికె రత్, మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, గాజవాక వర్తక సంఘం అధ్యక్షుడు తిప్పల చిన అప్పారావు, బెహరా బాస్కరరావు తది తరులున్నారు. అనంతరం జబర్థస్ట్ బృందం సందడి చేసిం ది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్

పంచాంగం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం శుక్ల పక్షం

ద్వాదశి రా. 8-23 వరకు
రోహిణి మ. 12-24 వరకు
వర్జ్యం సా. 5.33 నుండి 7-02 వరకు
దు.ము: ప. 8-42 నుండి 9-35 వరకు
పు.దు.ము మ. 12-22 నుండి 1-18 వరకు
రా.కా.ప 10-37 నుండి 12-11 వరకు

విశాఖపట్నం శుక్రవారం 18-1-2019

బీజేపీ సమ్మేళనం

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెండురోజుల పాటు జరిగిన బీజేపీ జాతీయ సమ్మేళనం పార్టీ శ్రేణులలో ఉత్సాహాన్ని, ప్రజలలో ఆశాభావాన్ని నింపలేకపోయింది. దేశం నలుమూలల నుంచి దాదాపు 12 వేల మంది ప్రతినిధులు హాజరైన ఈ సమ్మేళనం ద్వారా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని పార్టీ నాయకత్వం భావించింది. ప్రధాని మోదీ పరిపాలన ప్రధానాంశంగానే ఎన్నికల ప్రచారం సాగుతుందనేది ఈ సమావేశం ద్వారా ధ్రువపడ్డది. పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, ఇతర ప్రముఖులు ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. ప్రతిపక్షాలు గెలిస్తే అస్థిరత్వం నెలకొంటుందని, సాహసవంతుడైన నాయకుడికి, నాయకుడు లేని అవకాశవాద కూటమికి మధ్య పోటీ జరుగుతున్నదని రాజకీయ తీర్మానంలో వ్యాఖ్యానించింది. బీజేపీ నాయకత్వం కార్యకర్తలకు ఎన్నయినా చెప్పవచ్చు. కానీ ఎన్నికల సమయంలో ఏమి చెబుతారనేది ప్రజలను మెప్పించే విధంగా ఉండాలె. ప్రజలను మెప్పించే మాటలు మాట్లాడాలంటే మొదట మోదీ పాలనలోని విజయాలు, వైఫల్యాలపై పార్టీ నాయకత్వం నిష్పక్షపాతంగా ఆత్మవిమర్శ చేసుకోవాలె. ఆర్థికాభివృద్ధి, విదేశాంగం, చట్టబద్ధపాలన, పరిశుద్ధపాలన మొదలైన రంగాలలో మోదీ ప్రభుత్వం సాధించినదేమిటో, వైఫల్యాలు ఎదురైతే అందుకు కారణాలేమిటో ప్రజలకు వివరించాలె. పార్టీ పెద్దలు మోదీ నాయకత్వాన్ని ప్రశంసించినంత మాత్రాన ప్రజలు ఆమోదించాలనేమీ లేదు. భారత్ ఇరుగు పొరుగు దేశాలలో వ్యతిరేకత ప్రబలడం మొదలుకొని నోట్ల రద్దు విధానం బెడిసికొట్టడం వరకు విపులంగా పార్టీలో ఇప్పటికే ఆంతరంగికంగానైనా చర్చించి, కార్యకర్తలకు స్పష్టత ఇవ్వడం మంచిది. బీజేపీ జాతీయ సమ్మేళనంలో మొదటి రోజు ఆమోదించిన వ్యవసాయ తీర్మానం ఈ రంగం లో సంక్షోభాన్ని తొలిగించడానికి మోదీ ప్రభు త్వం ఏమి చేసిందో వివరించలేకపోయింది. స్వామినాథన్ సూచనల ప్రకారం రైతుల పండించిన ఖర్చుకు అదనంగా యాభై శాతం లాభం వచ్చే విధంగా చూస్తామని బీజేపీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. కానీ ఆ హామీని నెరవేర్చలేకపోయింది. దేశవ్యాప్తంగా రైతువర్గంలో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకున్నది. ఉత్తరాది రాష్ట్రాలలో జాట్లు, గుజరాత్‌లో పటీదారులు, మహారాష్ట్రలో మరాఠాలు ఇట్లా- పలు రాష్ట్రాలలో రైతు వర్గాలు తీవ్రస్థాయిలో నిరసనలు చేపట్టాయి. తమిళనాడులో జల్లికట్టు విషయమై ఇంత పెద్ద ఎత్తున ఆందోళన చెలరేగడానికి కూడా అంతర్లీనంగా వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభమే కారణమనే అభిప్రాయం ఉన్నది. మధ్య ప్రదేశ్‌లోనైతే ఆందోళన ఒక దశలో అదుపు తప్పింది. బీజేపీ పై వ్యతిరేకత ప్రబలడానికి వ్యవసాయ సంక్షోభమే కారణం. గుజరాత్ శాసన సభ ఎన్నికల లో అతి కష్టంగా కాంగ్రెస్‌పై విజయం సాధించినప్పటికీ బీజేపీపై ప్రజలలో వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని అప్పుడే తెలిసిపోయింది. ఇటీవలి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ప్రభుత్వాలు కూలిపోయాయి. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నప్పటికీ బీజేపీ నెట్టుకు రాలేకపోయింది. ఈ మూడు రాష్ట్రాల పరాజయాల నుంచి తగిన గుణపాఠాలు నేర్చు కోవాలని బీజేపీ రాజకీయ తీర్మానంలో కార్యకర్తలకు ఉద్బోధించింది. కానీ నేర్చుకోవలసింది పార్టీ కార్యకర్తలు కాదు, విధానకర్తలు! ప్రధాని మోదీ తమ ప్రసంగంలో తమది ఉత్తమమైన పాలన అని చెప్పుకుంటూ, ప్రతిపక్షాల పాలన అవినీతిమయమని దుమ్మెత్తి పోసారు.

కా'రణ'జన్ముడు ఎన్టీఆర్




ఎన్టీఆర్... ఆ మూడు అక్షరాలు చరిత్రను సృష్టిం చాయి. తెలుగు వాడి వాడి వేడి లోకానికి చాటి చెప్పాయి. ఆ రంగంలోనైనా తెలుగు వాడి దెబ్బ ఇదీ అని రుచి చూపించాయి. ఎన్టీఆర్ అన్న పేరు తెలుగు జాతికి, ఖ్యాతికి పర్యాయపదంగా మారిపోయింది. ఓ సామాన్యుని అసమాన్య విన్యాసాలకు నిలువెత్తు నిదర్శనం ఎన్టీఆర్. ఆ పేరులో పౌరుషం ఉంది, పొగ రు ఉంది, గర్వం ఉంది, తెలుగు రక్తం ఉంది. అం దుకే ఆ పేరు ఆచంద్రతారార్కం. అటు సినిమా, ఇటు రాజకీయ, సామాజిక రంగాలను తనవైపునకు తిప్పుకుని తానే అన్నీ అయి నడిపించిన మహానుభా వుడు ఎన్టీఆర్. ఆయన కాలాన్ని జయించారు అనడం ఈ సందర్భంగా సబబు. నందమూరి తారక రామా రావు 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో పుట్టారు. చిన్నతనంలోనే ఆయనకు కళారంగంపై ఆసక్తి ఉంది. చదువుకునే రోజుల్లోనే నాటకాలు వేస్తూ తనలోని కళాతృష్ణను రామారావు తీర్చుకున్నారు. ఆయన కళాశాల జీవితంలో దొరికిన అదృష్టంగా కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారిని చెప్పు కోవాలి. ఆయన తెలుగు పాఠాలతో ఎన్టీఆర్ తెలుగు భాషపై పట్టు సంపాదించారు. తెలుగు నుడికారంపై మమకారం పెంచుకున్నారు. తెలుగు ఎన్టీఆర్ స్వచ్ఛంగా మాట్లాడడానికి విశ్వనాథ వారి శిక్షణ ఎంతో కారణం. ఇక, ఎన్టీఆర్‌లో నటున్ని బయటకు తీయడం లోనూ విశ్వనాథవారు చాలానే కృషి చేశారని చెప్పాలి. కళాశాల సాంస్కృతిక విభాగానికి నాయకత్వం వహిం చిన విశ్వనాథ వారు ఎన్టీఆర్‌ను ఓ చారిత్రాత్మక నాట కంలో నటింపచేశారు. అయితే, ఎన్టీఆర్ ఆడవేషం వేయాలి అక్కడ. తన మీసాల పట్ల ఉన్న మక్కువతో ఎన్టీఆర్ వాటిని తీసేసి వేయనని పట్టుపట్టారు. చివరికి మీసాలతోనే ఆ నాటకంలో ఆయన పాత్ర పోషణ చేశారు. ఆ విధంగా మీసాల నాగమ్మగా ఎన్టీఆర్ కళా శాలలో ప్రసిద్ధమయ్యారు. ఇక, చదువు పూర్తి అయ్యాక ఎన్టీఆర్ కొన్నాళ్లు సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగాన్ని చేపట్టినా ఆయనకు సినిమా రంగంపై మక్కువతో మద్రాస్ పయనం కట్టారు. అక్కడ మొదట్లో చిన్న చిన్న ఇబ్బం దులు ఎదురైనా అపరిమితమైన ప్రతిభా పాటవాలు కలిగి ఉండడంతో ఆయన తొందరలోనే స్టార్ హీరోగా గుర్తింపు పొందారు. అది మొదలు మూడున్నర దశా బ్దాల కాలం పాటు ఆయన వెనక్కు తిరిగి చూసు కోలేదు. ఆయన ఆడిందే ఆట అన్నట్లుగా సినిమా జీవితం గడచిపోయింది. ఎన్టీఆర్ దాదాపుగా మూడు వందల పై చిలుకు సినిమాల్లో నటించారు. పౌరా ణికం, జానపదం, చారిత్రాత్మకం, సాంఘిక చిత్రాలలో ఆయన చిరస్మరణీయమైన పాత్రలను పోషించి తెలుగు వారికి వాటి తీపిని అందించారు. ఎన్టీఆర్‌లో మంచి దర్శకుడు ఉన్నారు. ఆయన తీసిన సీతారామ కళ్యాణం, శ్రీకృష్ణపాండవీయం, దానవీరశూరకర్ణ వంటి చిత్రాలు ఆయన దర్శకత్వ పటిమను చాటిచెబుతాయి. అలాగే, మంచి ఎడిటర్‌గా కూడా ఎన్టీఆర్ ప్రభుత్వ పురస్కారం అందుకు న్నారు. ఇక, సినిమాల్లో నటి స్తూనే సమాజానికి సంబం ధించిన సందేశాలను ఎప్పటి కపుడు అందించడం లోనూ ఎన్టీఆర్ ముందుండేవారు. అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అయినా, దేశం కరవు కోరల్లో చిక్కుకున్న సందర్భం అయినా, వరకట్నం వంటి దురాచారాలైనా, అవినీతి, అక్రమాలు ఇలా ప్రతీ దురాగతాన్ని వెండి తెరపై ఎన్టీఆర్ చూపించి దుష్ట సంహారం చేసే వారు. అందువల్లనే ఆయన తెలుగు జాతికి హీరోగా అవతరిం చారని చెప్పాలి. ఎన్టీఆర్‌లోని ఆ సామాజిక కోణమే ఆయనను రాజకీయాలవైపుగా నడిపించింది. 1982 మార్చి 29న ఆయన తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారు. టీడీపీని ఆయన ప్రకటించిన సందర్భంలో ఆయన చుట్టూ చాలా తక్కువమంది మాత్రమే ఉన్నారు. అయితే, ఆ ప్రకటన దావానలంగా వ్యాపించి ఓ ప్రభంజనాన్నే సృష్టించింది. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ఎన్టీఆర్ అప్పటికి మూడు దశాబ్దాల పై చిలుకు అధికారం చలాయించిన కాంగ్రెస్ పార్టీని పక్కన తోసేసి మరీ అధికారాన్ని చేపట్టారు. ఇక, 1984 ఆగస్టులో నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుపొడిచి ముఖ్యమంత్రి పదవిని లాగేసుకున్న సందర్భంలో నెల రోజుల పాటు ఎన్టీఆర్ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం చారిత్రాత్మకమైనది. తిరిగి ఎన్టీఆర్ గద్దెమీద కూర్చోవడం కూడా ఓ రికార్డు. 1984లో ఇందిరాగాంధీ మరణం తరువాత దేశవ్యాప్తంగా ఆమె సానుభూతి పవనాలు వీచినా ఏపీలో మాత్రం ఎన్టీఆర్ ప్రభంజనం కొనసాగడం విశేషం. ఇక 1985లో మరోమారు ఎన్టీఆర్ బంపర్ మెజారిటీలో అధికారంలోకి వచ్చారు. 1989లో మాత్రం ఆయన ప్రభుత్వ విధానాల కారణంగా ఓటమిపాలు అయ్యారు. పార్టీనే కాకుండా సొంతంగా కూడా ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఇక, 1994 నాటికి మళ్లీ ఎన్టీఆర్ విజృంభించారు. ఈసారి రికార్డు స్థాయిలో మెజారిటీని సాధించి కాంగ్రెస్‌ను కేవలం 26 సీట్లకే పరిమితం చేశారు. 1995లో ఆగస్టు సంక్షోభం మళ్లీ పుట్టింది. ఈసారి ఆయన్ని గద్దె నుంచి దించేసింది ఎవరో కాదు, అల్లుడు చంద్రబాబునాయుడు నాయకత్వంలో మొత్తం కుటుంబ సభ్యులు. ఈసారి మాత్రం ఎన్టీఆర్ ఈ వంచనను తట్టుకోలేకపోయారు. ఆయన రెండవ భార్య లక్ష్మీపార్వతిని సాకు చూపించి ఆయన్ని ముఖ్యమంత్రి పదవి నుంచి దించేయడమే కాదు, ఆయన పార్టీని కూడా లాగేసుకున్నారు. ఈ బాధతో ఎన్టీఆర్ కొన్ని నెలలు భారంగా గడిపి 1996 జనవరి 18న తనువు చాలించారు. ఈ లోకాన్ని శాశ్వతంగా వీడిపోయారు. ఎన్టీఆర్ జీవితంలో ఎత్తుపల్లాలు ఎన్ని ఉన్నా ఆయన జీవితం మాత్రం స్ఫూర్తిదాయకమే. అందరికీ ఆదర్శనీయమైనదే. కష్టించి పనిచేయడం, అద్భుతమైన విజయాలు అందుకోవడం అన్నది ఎన్టీఆర్‌ను చూసే నేర్చుకోవాలి. మహాకవి డాక్టర్ సి నారాయణరెడ్డి అన్నట్లుగా ఎన్టీఆర్ కారణజన్ముడు, రణజన్ముడు. తెలుగు జాతి ఉన్నంతవరకూ ఆయన చరిత్ర శాశ్వతం.

ఎన్టీఆర్ దాదాపుగా మూడు వందల పై చిలుకు సినిమాల్లో నటించారు. పౌరాణికం, జానపదం, చారిత్రాత్మకం, సాంఘిక చిత్రాలలో ఆయన చిరస్మరణీయమైన పాత్రలను పోషించి తెలుగు వారికి వాటి తీపిని అందించారు. ఎన్టీఆర్‌లో మంచి దర్శకుడు ఉన్నారు. ఆయన తీసిన సీతారామ కళ్యాణం, శ్రీకృష్ణపాండవీయం, దానవీరశూరకర్ణ వంటి చిత్రాలు ఆయన దర్శకత్వ పటిమను చాటిచెబుతాయి. అలాగే, మంచి ఎడిటర్‌గా కూడా ఎన్టీఆర్ ప్రభుత్వ పురస్కారం అందుకున్నారు. ఇక, సినిమాల్లో నటిస్తూనే సమాజానికి సంబంధించిన సందేశాలను ఎప్పటికపుడు అందించడంలోనూ ఎన్టీఆర్ ముందుండేవారు.
అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అయినా, దేశం కరవు కోరల్లో చిక్కుకున్న సందర్భం అయినా, వరకట్నం వంటి దురాచారాలైనా, అవినీతి, అక్రమాలు ఇలా ప్రతీ దురాగతాన్ని వెండి తెరపై ఎన్టీఆర్ చూపించి దుష్ట సంహారం చేసే వారు. అందువల్లనే ఆయన తెలుగు జాతికి హీరోగా అవతరించారని చెప్పాలి. ఎన్టీఆర్‌లోని ఆ సామాజిక కోణమే ఆయనను రాజకీయాలవైపుగా నడిపించింది. 1982 మార్చి 29న ఆయన తెలుగుదేశం పార్టీని ఏర్పాటుచేశారు. టీడీపీని ఆయన ప్రకటించిన సందర్భంలో ఆయన చుట్టూ చాలా తక్కువమంది మాత్రమే ఉన్నారు. అయితే, ఆ ప్రకటన దావానలంగా వ్యాపించి ఓ ప్రభంజనాన్నే సృష్టించింది. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ఎన్టీఆర్ అప్పటికి మూడు దశాబ్దాల పై చిలుకు అధికారం చలాయించిన కాంగ్రెస్ పార్టీని పక్కన తోసేసి మరీ అధికారాన్ని చేపట్టారు.

-పివిఎస్ఎస్ ప్రసాద్, విశాఖపట్నం.

కర్మ-విశ్రాంతి

చైనా తాత్వికుడయిన కన్‌ఫ్యూషియస్ దగ్గరకు ఒక వ్యక్తి వెళ్ళి నమస్కరించి "అయ్యా! నేను జీవి తంలో ఎంతో అలసిపోయాను. ఎన్నో పనులు చేసి విసిగిపోయాను. ఇప్పుడు విశ్రాంతి కోరుకుంటున్నా ను. విశ్రాంతికి ఏదయినా మార్గముంటే తెలపండి. విశ్రాంతి ఉంటేనే నా జీవితానికి ఓదార్పు దొరుకు తుంది. మీలాంటి మహాపురుషులు మాత్రమే దానికి మార్గం చూపించగలరని నమ్ముతున్నాను" అన్నాడు. కన్‌ఫ్యూషియస్ ఆ వ్యక్తి చెప్పినవన్నీ విన్నాడు. ఏమీ మాట్లాడలేదు. లేచి ఆవ్యక్తిని తన వెంట రమ్మన్నాడు. ఇద్దరూ కొంత దూరం నడిచారు. నడిచేంతసేపూకూడా కన్‌ఫ్యూషియస్ ఏమీ మాట్లాడలేదు. వెంట నడుస్తున్న వ్యక్తికి అంతా అయోమయంగా ఉంది. ఏమీ మాట్లాడకుండా ఈ వ్యక్తి ఎక్కడకు తీసుకెళుతున్నాడా? అని ఆశ్చర్యపోయాడు. కొంత దూరం నడిచి వెళ్లాక కన్ఫ్యూషియస్ ఆగాడు. ఎదురుగా ఉన్న శ్మశానాన్ని చూపించాడు. ఆ వ్యక్తికి ఏమీ అర్థం కాలేదు. "ఎందుకు నన్ను శ్మశానానికి తీసుకొ చ్చారు. ఎందుకు దాన్ని చూపుతున్నారు?" అని అడిగాడు. కన్‌ఫ్యూషియస్ "విశ్రాంతి అన్నది శ్మశా నంలో మాత్రమే ఉంది. సమాధిలో మాత్రమే ఉంది. శాంతి కావాలన్నా, విశ్రాంతి కావాలన్నా చనిపోవాలి. అనుదిన జీవనమన్నది విశ్రాంతికి పూర్తిగా వ్యతిరేకమైంది. కర్మ, విశ్రాంతి ఒకదానికొకటి వ్యతిరేకమయినవి. కర్మ జీవికి విశ్రాంతి ఉండదు. జీవితానికి అర్థం పని. జీవితా నికి విశ్రాంతి అన్నది వ్యతిరేకమయింది. నీకు జీవితం కావాలా? మరణం కావాలా? తేల్చుకో. మరణంలోనే విశ్రాంతి ఉంది" అన్నాడు. ఆమాటలు విని ఆ వ్యక్తి



బిత్తరపోయాడు. కన్‌ఫ్యూషియస్ చెప్పిందానికి నేను పూర్తిగా వ్యతిరేకిని. జీవితానికి మరణమన్నది వ్యతిరేకం కాదు. మరణం జీవితా నికి ఆఖరి మజిలీ. మృత్యువు విశ్రాంతి కాదు. బతుకులో ఉన్న అశాంతి మరణంలో కూడా వెంబ డిస్తుంది. పీడిస్తుంది. మరణం జీవితానికి వ్యతిరే కం కాదు. అది జీవన సారాంశం. జీవితంలో కర్మ మాత్రమే ఉంటుందని, విశ్రాంతి ఉండదని అనడం సరికాదు. కర్మ అన్నది బాహ్య ప్రపంచానికి సంబంధించింది. శరీరానికి సంబంధించింది. బయటి ప్రపంచానికి సంబంధించినంత మేరకూ దేహికి సంబంధించినంతవరకు కర్మ అనివార్యం. పని చేయడం తప్పనిసరి. కానీ మనిషి కేవలం శరీర మాత్రుడు కాదు. మనిషికి శరీరం ఒక్కటే లేదు. లోపల ఆత్మఉంది. అస్థిత్వ ముంది. చైతన్య ముంది. అవి విశ్రాంతి కేంద్రాలు. తన బాహ్య కర్మను వ్యక్తి ఎప్పుడయితే సంపూర్ణంగా నిర్వహి స్తాడో అతడు అస్తిత్వపు కేంద్రాన్ని ఉపసంహరిం చుకుంటాడు. అక్కడ విశ్రాంతి పొందుతాడు. జీవి తంలో ద్వంద్వాలు ఉన్నాయి. ప్రకృతిలో ఉన్నాయి. రాత్రి,పగలు, పగలు శ్రమిస్తాం. రాత్రి విశ్రాంతి తీసుకుంటాం. మనిషికి శరీరం ఉంది. ఆత్మ ఉంది. శరీరం కర్మను నిర్వహిస్తుంది. ఆత్మ విశ్రాంతినిస్తుంది.

దిన ఫలాలు

శుక్రవారం -18-1-2019

మేషం: విద్యార్థులకు ఒత్తిడి, శ్రమ అధికంగా ఉంటాయి. ఎప్పటి నుండో వాయిదా పడిన మొక్కుబడులు తీర్చు కుంటారు. సంఘంలో గుర్తింపు, పేరు, ప్రఖ్యాతలు లభిస్తాయి.

వృషభం: ఆర్థిక లావాదేవీలు మీరు చూసుకోవడం ఉత్తమం. సాంస్కతిక కార్యక్రమాల పట్ల శ్రద్ధ వహిస్తారు. మీ అంచనాలు నిజమై ఊపిరి పీల్చుకుంటారు.

మిథునం: ఆర్థిక విషయాలలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారులకు మిశ్రమ ఫలితాలు కలుగుతాయి. అలౌకిక విషయాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

కర్కాటకం: గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. మిమ్మల్ని ఉద్రేక పరచి లబ్ధి పొందిదడానికి ప్రయత్నిస్తారు.

సింహం: పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. వ్యాపారము నందు రావలసిన బాకీలు వచ్చును. సహోద్యోగులతో సంబంధాలు బలపడుతాయి.

కన్య: ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. భాగస్వామిక ఒప్పందాలు ప్రముఖులతో చర్చలు సత్ ఫలితాలు ఇస్తాయి. చిన్న తరహా పరిశ్రమ వారికి లాభదాయకం.

తుల: ప్రైవేటు సంస్థలలోని వారి ప్రతి విషయంలోను ఓర్పు, లౌక్యం అవసరం. ఆపద సమయంలో సన్నిహితులు అండగా నిలుస్తారు. బంధువులతో విభేదాలు ఏర్పడుతాయి.

వృశ్చికం: ఫ్యాన్సీ, గృహోపకరణాల వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. తోటల రంగాలలో వారికి ఊహించని మార్పులు సంభవిస్తాయి.ఓర్పు సంయమనం అవసరం.

ధనస్సు: భాగస్వామిక ఒప్పందాల్లో మీ ప్రతిపాదనలకు వ్యతిరేకత ఎదురవుతుంది. కంప్యూటర్, టెక్నికల్ రంగాలలో వారికి కలిసివచ్చే కాలం. ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

మకరం: నిరుద్యోగులు ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తారు. దైవ, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తారు. వాహనం ఇతరులకు ఇచ్చి ఇబ్బందులను ఎదుర్కుంటారు.

కుంభం: స్త్రీలకు అలంకరణ, విదేశీ వస్తువుల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ముఖ్యులతో సంభాషించేటపుడు ఆచితూచి వ్యవహరించడం మంచిది. ఆత్మవిశ్వాసనం రెట్టింపవుతుంది.

మీనం: ఆర్థిక విషయాలలో ఒకడుగు ముందుకు వేస్తారు. మిత్రులను కలుసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యే సూచనలున్నాయి. మధ్యవర్తిత్వం. మంచి గుర్తింపు లభిస్తుంది.

ఆకలి తీరుస్తున్న ఆలోచన

హంగు ఆర్భాటాలతో జరిగే ఓ పెండ్లి వేడుకకు వెళ్లింది. అక్కడ కనిపించిన ఓ దృశ్యం ఆమెను బాధిం చింది. అక్కడ ఓ ఆలోచన పుట్టింది. అది ఆమెను మార్చేసిం ది. ఇప్పుడు వందల మంది ఆక లిని తీరుస్తున్నది. తైరా భార్గవ.. బడికి వెళ్లి పాఠాలు నేర్చుకునే విద్యార్థి. ఆమె సొంత ఆలోచనతో ఇప్పుడు ఢిల్లీలో ఒక ప్రాజెక్టును చేపట్టింది. దానికి ప్రాజెక్ట్ డబుల్ రోటి అని పేరు పెట్టింది. ఆకలితో ఉన్న వాళ్ల జాడ తెలుసుకుని వాళ్ల ఆకలి తీర్చడమే ఆమె చేస్తున్న పని. ఇలా వారానికి సుమారు మూ డు వందల నుంచి నాలుగు వందల మందికి తైరా ఆహారాన్ని అందిస్తు న్నది. పెళ్లి వేడుకలో మిగిలిన ఆహారాన్ని వృథాగా పడేయడమే ఆమె చూసిన దృశ్యం. ఆ ఘటన ఆమెను బాధించింది. దేశంలో సరైన పౌష్టికాహారం, తినడానికి తిండి లేక ఎంతో మంది అలమటిస్తున్నారని తెలుసు కున్నది. మరోవైపు సరైన ఆహారం ఉన్నా అది అవ సరమైన వారికి అందటం లేదని తెలుసుకున్నది. హోటళ్లలో, బేకరీలలో వృథా చేస్తున్న నాణ్యమైన ఆహా రాన్ని సేకరించాలనుకుంది. తనకు తెలిసిన బేకరీ వాళ్లతో మాట్లాడి వృథా చేస్తున్న తిను బండారాలను సేకరించి పేదవాళ్లకు అందిస్తుంది. ముఖ్యంగా బేక రీల నుంచి వచ్చే బ్రెడ్‌ను వృథా చేయకుండా వారానికి నాలుగు వందల



మంది పిల్లలకు, పెద్దలకు అందిస్తుంది. దీనికి అవసరమయ్యే రవాణా చార్జీలను సొంతంగా భరి స్తుంది. ముందు ముందు ఎవరైనా ప్రోత్సాహమం దిస్తే, సహకారం పెరిగితే మరింత ఎక్కువ మందికి ఆహారాన్ని అందిస్తానంటున్నది.

చరిత్రలో ఈరోజు -18

1927:భారత పార్లమెంటు భవనం ప్రారంభించబడింది.
1927 : సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు సుందరం బాలచందర్ జననం.(మ.1990)(చిత్రంలో)
1936 : ప్రసిద్ధ ఆంగ్ల రచయిత మరియు కవి రుడ్యార్డ్ కిప్లింగ్ మరణం.
1947 : భారతీయ గాయకుడు, నటుడు కుందన్ లాల్ సైగల్ మరణం.
1950 : ప్రముఖ హేతువాది, సాహితీకారుడు అదృష్టదీపక్ జననం.
1972 : భారత క్రికెట్ ఆటగాడు జననం వినోద్ కాంబ్లి జననం.
1978 : భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అపర్ణా పోపట్ జననం
1996 : ఆంధ్ర ప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు మరణం
2003 : ప్రముఖ కవి హరి వంశ రాయ్ బచ్చన్ మరణం (జ.1907)




హరి వంశ రాయ్ "బచ్చన్" శ్రీవాస్తవ్ (నవంబర్ 27, 1907 జనవరి 18, 2003) మిగతా కవులతో తన కవితలలో వ్యత్యాసం చూపించి ప్రఖ్యాతి గాంచిన హిందీకవి, ఈయన 20 వ శతాబ్దం మొదలులో హిందీ సాహిత్యంలో చాయావాద సాహిత్యోద్యమ మునకు (ప్రణయ కవిత్వం) చెందినవాడు. అతని ప్రతిభకు తొలి విజయం అందించింది మధుశాల (అంతే కాకుండా ఆయన బాలి వుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ తండ్రి కూడా. ఆయన అలహాబాద్ దగ్గర ఉన్న బాబుపట్టి గ్రామం (రాణి గంజ్), ప్రతాప్ గడ్ జిల్లా అప్పటి యునైటెడ్ ప్రోవిన్సెస్ (ప్రస్తుతం ఉత్తర్ ప్రదేశ్) లో జన్మించారు. ఆయన ప్రతాప్ నారాయణ్ శ్రీవాస్తవ్, సరస్వతి దేవి ల మొదటి సంతానం. ఆయన్ని బచ్చన్ (చిన్న పిల్ల వాణి వలె) అని ఇంట్లో ముద్దుగా పిలిచేవారు. ఆయన తన ప్రాథమిక విద్య పురపాలక విద్యాలయంలో అభ్యసించారు. తరువాత కుటుంబ పరంపరను అనుసరించి కాయస్థ పాఠశాలలో చేరి ఉర్దూ అభ్యసించారు అది ఆయన న్యాయ వాద చదువుకు తొలిమెట్టు. తరువాత ఆయన విద్యాభ్యాసం అలహా బాద్ విశ్వా విద్యాలయం మరియు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సాగింది. ఆ కాలంలో మహాత్మా గాంధీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్వాతంత్ర్యో ద్యమం వైపు ఆకర్షితులు అయ్యాడు. హరివంశ్ రాయ్ 1966లో రాజ్యసభకు ఎన్నికయ్యాడు. మూడు సంవత్సరాలు తరువాత కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకున్నాడు. 2003 జనవరి 18న 95 సంవత్సరాల వయస్సులో వివిధ శ్వాసకు సంబంధించిన వ్యాధులతో ఆయన పరమపదించారు.

మహాభారతం

కృపా చార్య, కృతవర్మలు ఎదుర్కొన్నారు అర్జునుణ్ణి. వారిని కూడా లెక్క చేయలేదు అర్జునుడు. దారుణ బాణాలతో ఆ శూరులను ఎదుర్కొన్నాడు.

రోషావేశంతో మండిపడ్డాడు దుశ్శాసనుడు. అర్జునుని డీకొన్నాడు. క్షణకాలంలోనే పలాయనం చిత్తగించాల్సి వచ్చిందతనికి.అదంతా దూరంలో ఉండి గమనిస్తూ వచ్చిన కర్ణుడు, మరి ఆలస్యం చేయక అర్జునుని ఎదుర్కొనేందుకు ముందుకురికాడు. అతనలా వస్తోన్నది గమనించి రథాన్ని అటుగా పోనిమ్మని కృష్ణుని ఆదేశించాడు అర్జునుడు.వారింకా వస్తూనే ఉన్నారు. మూడు బాణాలు ప్రయోగించి అర్జునుణ్ణి, ఇరవై బాణాలు ప్రయోగించి కృష్ణుణ్ణి ఇనుమిక్కిలిగా నొప్పించాడు కర్ణుడు. అతని విజృంభణ గమనించిన యుధామన్యుడు, శిఖండి, ద్రౌపదీకుమారులు, ఉత్తమౌజుడు, యుయుత్సుడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు తమ తమ సైన్యాలతో కర్ణుని చుట్టుముట్టారు.

"విజృంభించండి! కర్ణుడికి ఊపిరి ఆడకూడదు" అన్న ధర్మరాజు మాటననుసరించి వారంతా వివిధ శస్త్రాస్త్రాలు కర్ణుని మీదే ఒకేసారి ప్రయోగించి గొంతెత్తి గర్జించారు. అయినా కర్ణుడు ఏమాత్రం భయపడలేదు. వివిధ భీషణ శస్త్రాస్త్ర పరంపరతో వారినంతా ఓడించాడు. అసంఖ్యాకంగా ఏనుగుల్ని, గుర్రాలను, పదాతి భటుల్ని నేల కూల్చాడు. ఆకాశాన నిలిచి కర్ణుని విక్రమాటోపం గమనించిన దేవతలంతా అతన్ని ముక్తకంఠంతో అభినందించారు. అర్జునుడు ఆ అభినందనలను వినలేకపోయాడు. కర్ణుని మీద, కౌరవ సైన్యం మీద నిరంతర క్రూర నారాచ సమూహాలను ప్రయోగించాడు. పెనుమంటలు సృష్టించాడు. అసంఖ్యాక చతురంగ బలాలను నేలకూల్చి విజయోత్సాహంతో దేవ దత్తం పూరించాడు.సూర్యాస్తమయం అయింది. సాంధ్య



దుర్యోధనుని మూర్ఛ

రక్తిమ అంతటా వ్యాపించింది. చీకట్లు ముసురుకున్నాయి. చిక్కబడ్డాయి. దాంతో ఇరు పక్షాల యోధాగ్రేసరులంతా తమ తమ శిబిరాల వైపు ప్రయాణించారు. రాత్రి అయింది. శిబిరంలో మంత్రి సామంతులతో పర్యాలోచనలు ప్రారంభించాడు దుర్యోధనుడు.

అర్జునుని ఆనాటి పరాక్రమాటోపం ప్రస్తావనకు వచ్చింది. ఆ వీరుణ్ణి ఎదిరించి నిలవడం కష్టమన్నారంతా. ఆ మాటలను ఒప్పుకోలేదు కర్ణుడు. దుర్యోధనుని సమీపించి ఇలా అన్నాడు."అన్ని వేళలా జయం ఒకరిదే అనుకోవడం పొరపాటు. ఇవాళ అర్జునుడు గెలిచాడు. రేపు మనం గెలుస్తాం. ఇది ముమ్మాటికీ నిజం. రేపు నేను ఆ అర్జునుని, అతని సారథి శ్రీకృష్ణుని ఓడించి తీరుతాను. ఒక్కమాటలో చెప్పాలంటే...దాతా! రేపీపాటికి నీకు శత్రువు అన్న వాడుండడు. చాలా""చాలు మిత్రమా చాలు" ఆనందించాడు దుర్యోధనుడు. సమావేశం ముగిసింది. పాల్గొన్న ప్రముఖులంతా ఎవరి శిబిరాల్లోకి వారు వెళ్ళిపోయారు. ఒంటరిగా మిగిలిపోయాడు దుర్యోధనుడు. తనకు ఇచ్చిన మాట రేపు కర్ణుడు నిలుపుకుంటే బాగుణ్ణనుకున్నాడతను.నిద్రపట్టలేదతనికి. సూర్యోదయం అయింది. కురుక్షేత్రం వైపు సంగర ప్రస్థానాలు ప్రారంభమయ్యాయి. ఇరుపక్షాలు సంగ్రామ రంగాన్ని చేరుకున్నాయి.

సంచలన వార్తాపత్రిక
లీడర్
అనకాపల్లి

విశాఖపట్నం
శుక్రవారం 18-1-2019

పందెంరాయుళ్ల అరెస్ట్

మాకవరపాలెం, న్యూస్‌లీడర్: కోడిపందాలు ఆడుతున్న 23 మందిని అరెస్టు చేసి 15 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. చినరాచపల్లిలో పందాలు నిర్వహిస్తుండగా ఆరుగురు వ్యక్తులు, ఒక కోడి, తామరంలో ఇద్దరు, 3కోళ్లు, అడిగర్లపాలెంలో ఆరుగురు, 4 పుంజులు, వి.నగరంలో ఇద్దరు వ్యక్తులు, రెండు కోడిపుంజులు పట్టుకున్నామన్నారు. అలాగే బిఎస్‌పేటలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఐదు కోళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని ఎస్సై వివరించారు.

యువకుడు అనుమానాస్పద మృతి


మృతిచెందిన వెదురుపర్తి శ్రీను

చోడవరం, న్యూస్‌లీడర్:
పట్టణంలోని గునిశెట్టివారి వీధిలో వెదురుపర్తి శ్రీను (34) అనుమానాస్పదంగా మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే దేవరాపల్లి మండలం తెనుగుపూడి గ్రామానికి చెందిన వెదురుపర్తి శ్రీను చోడవరంలోని వీరమళ్ల బ్రహ్మానందం కుమార్తె వెంకటలక్ష్మిని గత ఏడాది మేలో వివాహం చేసుకున్నాడు. సంక్రాంతి పండగకు బుధవారం మధ్యాహ్నం అత్తగారింటికి వచ్చి రాత్రి మొదటి ఆట సినిమా చూసి ఇంటికి వచ్చి పడుకొన్నాడు. అర్ధరాత్రి సమయంలో ఫిట్స్‌లా వచ్చి బాత్‌రూమ్ వద్ద పడిపోయాడని, దీంతో 108లో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సమయానికి మృతిచెందాడని బ్రహ్మానందం తెలిపారు. అయితే మృతుడు అన్నయ్య సన్యాసిరావు తన తమ్ముడికి ఎటువంటి అనారోగ్యం లేదని, గతంలో ఎన్నడూ ఫిట్స్ రాలేదని, అతని అత్తగారి కుటుంబీకులే హత్యచేశారని గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కె.మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

18న ఎన్టీఆర్ వర్ధంతి



అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
పట్టణంలో ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఎన్టీఆర్ 21వ వర్ధంతిని శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ కేకేవీపి నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణంలో గల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో హాజరుకావాలని డాక్టర్ నారాయణరావు పిలుపునిచ్చారు.

ఉత్తమ రైతులకు సత్కారం



మాడుగుల, న్యూస్‌లీడర్: రాత్రి పగలు కష్టపడి పనిచేసే రైతులు వారి శ్రమను గుర్తించి వారిని ఘనంగా సత్కరించాలని భారత నిర్మాణసేన సభ్యులు సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15మంది సేంద్రీయ వ్యవసాయ చేసే రైతులను ఘనంగా సన్మానించారు. సాధారణంగా సన్మానం అంటే శాలువా కప్పి సత్కరించడం ఆనవాయితీ. అలా కాకుండా రైతులకు ఉపయోగపడే విధంగా పాలుపోసే స్టీల్ క్యాన్, చీకట్లో ఇబ్బందులు కలగకుండా టార్చ్‌లైట్, ఎండకు, వానకు తడ కుండా గొడుగులను ఏర్పాటు చేయడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. హిందూ సాంప్రదాయాలు తెలిసే విధంగా వందమంది చిన్నారులచే సాంప్రదాయ దుస్తులు ప్రదర్శనతో పాటు చిన్నారుల ముద్దుముద్దు మాటలతో వారిచే క్యాట్ వాక్ చేయించి వారు చదువుతున్న పాఠశాలపేరు, తల్లిదండ్రుల పేర్లు చెప్పించడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఎంతో ఆనందాన్ని అనుభూతిని పొందారు. ఇంకా మండల స్థాయి కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలు, డ్యాన్సుబేబీ వంటి పోటీలు ఏర్పాటు చేయడం సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ జన్మభూమి సమన్వయకర్త పైలా ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీటీసీ వడ్డాది వరలక్ష్మి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు పుట్టా మురళీకృష్ణతో పాటు మరికొంత మంది గ్రామ పెద్దలు, భారత నిర్మాణసేన సభ్యులను అభినందించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో గౌరీపట్టపు మహేష్‌కుమార్, బొడ్డేటి నాయుడు, బత్తుల మూర్తి, దంగేటి మోహన్, జాగాని ఈశ్వరరావు, మణికంఠ, డోకల నాగు, పుట్టా వాసు, సీహెచ్ మధు, జల్లు సంజయ్ పాల్గొన్నారు.

13మంది రికార్డింగు డ్యాన్సర్లపై బైండోవర్ కేసులు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: ఉత్సవాలలో రికార్డింగు డ్యాన్సులు, గుళ్లాటలు, పేకాటలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని పట్టణ సీఐ కిరణకుమార్ అన్నారు. ఈ సందర్భంగా గతంలో రికార్డింగు డ్యాన్సులు నిర్వహించే 13మందిపై ముందస్తు చర్యలలో భాగంగా బైడోవర్ కేసులను నమోదు చేశారు. ఇప్పటికే పేకాట రాయుళ్లపై బైండోవర్ కేసులను నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ బైడోవర్ కేసులను డీఎస్పీ పాపారావు ఆదేశాల మేరకు 13మందిపై బైడోవర్ కేసులను నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ స్వీటీ, హెచ్‌సీ శ్యామల తెలిపారు.

అనకాపల్లి డీఎస్పీగా ఎస్‌వీవీ ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనకాపల్లి డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు అన్నారు. ఏసీబీ డీఎస్పీగా విజయవాడలో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన ప్రసాదరావు అనకాపల్లి డీఎస్పీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఉత్తరాంధ్ర ఇల వేల్పు శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వ హించారు. డీఎస్పీ ప్రసాదరావును సీఐలు కిరణ్‌కుమార్, రామచంద్రరావు, శ్రీనివాసరావులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కోడిపందాలపై పోలీసుల దాడులు

చోడవరం న్యూస్‌లీడర్: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందాలు ఆడుతున్న జూదరులపై పోలీసులు దాడులు చేశారు. గురువారం ఉదయం మండలంలోని ముద్దుర్తి గ్రామంలో కోడిపందాల ఆటపై దాడిచేసి నాలుగు కోళ్లు, జూదం ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.2,160లు నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బుధవారం సైతం గవరవరం, గంధవరం, మైచర్లపాలెం గ్రామాల్లో ఎస్ఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మికంగా దాడులు చేసి 14కోడిపుంజులను, 11మందిని అదుపులోకి తీసుకొని రూ.23వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే దామునాపల్లి గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న షాపుపై దాడిచేసి 31మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జూదరులను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలిస్తున్నట్లు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: అగనంపూడి శ్రీసాయిబాబా మందిరంలో గురువారం పర్వదినాన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం పుణ్యాహవాచనం, ఐదున్నరకు బాబా హరతి, నూతన పట్టు వస్త్రాలతో బాబాకు అలంకరణ చేశారు. మధ్యాహ్నం వృద్ధులకు, పేదలకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొయ్య వెంకట రమణారెడ్డి, ధర్మాల వ్యాస శర్మ, ధర్మాల సుబ్బలక్ష్మి, ఆర్.సత్యశ్రీదేవి పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


పూజలు చేస్తున్న ఛైర్మన్ కొయ్య వెంకటరమణారెడ్డి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్


విలేకరులతో మాట్లాడుతున్న గోపీనాథ్

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోగా యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించడానికి ఎమ్మెల్సీ గాదె శ్రీను వాసులునాయుడు సహకారంతో పిఆర్‌టియు కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోపీనాథ్ అన్నారు. మండలంలోని వడ్డాదిలో గురువారం ఆయన స్థానిక విలేకులతో మాట్లాడారు. రూ.398లు వేతనంతో పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు జారీకి కృషి చేస్తున్నామన్నారు. 1998,2008, 2012 డిఎస్సీ క్వాలిఫైడ్ బాదితులు సుమారు 7,384 మందికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం తిపి కబురు అందించనుందన్నారు.వీరిని ఎమ్మెల్సీ కమిటీ సిఫారసు మేరకు ఎంటీఎస్, స్పెషల్ విద్యామిత్ర లుగా నియమించడానికి తగిన విదివిదానాలకు ప్రభుత్వం స్వీకారం చుట్టిందని గోపీనాథ్ అన్నారు.ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ,యుకేజీ తరగతులు ప్రవేశపెట్టడం ద్వారా ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందన్నారు. జెడ్‌పిపిఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో పెట్టి అన్ని ఖాతాలను అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సాను కూలంగానే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిఆర్‌టియు, మిత్ర సంఘాలు బలపరిచిన అభ్యరి సిటింగ్ సభ్యుడు గాదె శ్రీనువాసుల నాయుడుకు ఉపాధ్యాయులు మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.రామునాయుడు, ఉపాధ్యాయులు బొర్రా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బడ్డీని తొలగించాలి



అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని ఆరవ వార్డు వేల్పులవీధి రామాలయం ప్రక్కన్న ఉన్న బడ్డీని తొల గించకుండా సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. బడ్డీని తొలగించి రోడ్డు వేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

అలరించిన రోషల్‌లాల్ ఆర్కెస్ట్రా


మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం రూరల్, న్యూస్‌లీడర్: నర్సీపట్నంలో మకరజ్యోతి మహోత్సవాల సందర్భంగా విశాఖ వారిచే ఏర్పాటు చేసిన రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఎంతగానే అలరించింది. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్నపాత్రుడు విచ్చేసి మాట్లాడారు. మకరజ్యోతి మహోత్సవాలు విజయవంతం చేసినందుకు ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఉత్సవాలు విజయవంతంకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాకారులను సన్మానించారు.

శిలాఫలకం ధ్వంసం

బుచ్చెయ్యపేట, న్యూస్‌లీడర్: మండలంలోని పొట్టిదొర పాలెంలో ఇటీవల సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే రాజు ఆవిష్కరించిన శిలాఫలకం ధ్వంసం అయ్యింది. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేసారని స్థానిక తేదేపా నాయకులు గుద్దేటి రాజు, విరోది సత్తిబాబులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పి.డి.పాలెం వచ్చి విచారణ ప్రారంభించారు.


క్రీడల్లో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలి

విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్


పోటీలలో గెలుపొందిన విజేతలతో దాడి రత్నాకర్

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
తమ పిల్లలు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు తల్లిదండ్రులుకూడా తగిన ప్రోత్సాహం అందించాలని విశాఖ రైతు సమాఖ్య అధ్యక్షులు దాడి రత్నాకర్ కోరారు. స్వర్గీయ బొత్స సింహాచలం(ఏఎంఏఎల్ కాలేజీ లెక్చరర్) జ్ఞాపకార్థం అనకాపల్లి అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐదు రోజులపాటు షెటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు అండర్-14, అండర్-16 విభాగాలలో బాల బాలికలకు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రత్నాకర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తిగల క్రీడలను ఎంచుకొని వాటిలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైన రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వాలీబాల్ రిఫరీ రాపేటి సీతారామ్, సంస్థ ప్రతినిధులు ఆదారి రవికుమార్, కాండ్రేగుల మనోజ్, కశింకోట ప్రసాద్, పెంటకోట సాగర్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా షెటిల్ కోచ్ కొణతాల మోహన సురేష్, రిఫరీలుగా ప్రసాద్, డి.తేజలు వ్యవహరించారు. **పోటీల విజేతలు...** అండర్-14 బాయ్స్ సింగిల్స్‌లో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో కె.సాయికిరణ్, టి.భువన్, సీహెచ్ ప్రసాద్‌లు నిలిచారు. అండర్-16లో టి.భువన్, కె.సాయికిరణ్, పి.భవానీశంకర్‌లు నిలిచారు. అలాగే గర్ల్స్ విభాగంలో ఎస్.వందనలీల, కె.జాహ్నవి, కె.హరితకుమారిలు గెలుచుకున్నారు. డబుల్స్ అండర్-14 బాయ్స్ డబుల్స్‌లో జి.సురేష్, సీహెచ్ ప్రసాద్, అండర్-16లో టి.భువన్, పి.తేజలు ఒకటి, రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్ అండర్-16 గర్ల్స్ విభాగంలో ఎస్.వందన లీల, కె.హరిత కుమారిలు ఒకటి, రెండు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

దోషులను కఠినంగా శిక్షిస్తాం: డీఎస్పీ ప్రసాద్


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

మాడుగుల, న్యూస్‌లీడర్:
వీరవల్లి అగ్రహారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహంధ్వంసం చేసిన వారిని వెంటనే పట్టుకుని వారిని శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డిఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం మాడుగుల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్ప అట్టాడ బాపూజీ ఆదేశాల మేరకు విగ్రహం ధ్వంసం చేసిన వారిని పట్టుకునేందుకు విచారణ చేస్తున్నామని ఆయన విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని వారిని విచారణ చేసి నిందితులు ఎవరన్నది విచారణ చేస్తామని చెప్పారు. తీర్థాలు, జాతరలలో డ్యాన్స్ బేబి డ్యాన్స్, కోడిపందాలు, గుళ్ల ఆటలు, ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్వహించరాదని జిల్లా అదికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సీఐ కిరణ్‌కుమార్, చోడవరం సిఐ ఎం శ్రీనివాసరావు, మాడుగుల ఎస్సై రాజాన ధనుంజయ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక ఆర్టీసి బస్సులు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్: ఇక్కడి ఆర్టీసి డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు నర్సీపట్నం ఆర్టీసి డిపో మేనేజర్ సిహెచ్.సూర్యపవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ కోసం వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని దీనిని నడుపుతున్నారు. తొలుత నుంచి ఒక సర్వీసును తిప్పుతున్నారు. తాజాగా నడుపుతున్న రెండో బస్సు రాత్రి ఏడు గంటలకు ఇక్కడ బయలుదేరుతుంది. ఈ నెల 20వ తేదీ వరకు దీనిని తిప్పనున్నామని ఆర్టీసి డిపో మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు.

తీర్థాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు

రావికమతం, న్యూస్‌లీడర్
గ్రామాల్లో నిర్వహించే తీర్థాల్లో ఆశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కొత్తకోట సిఐ మల్లేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో స్టేజి ప్రోగ్రామ్‌ల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. కోడి పందాలు వంటివి నిర్వహించరాదన్నారు. తీర్థాల సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. పేకాట, కోడిపందాలు జరిగితే ఆయా గ్రామాల వారు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

22న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

చింతపల్లి ఏఎస్పీ సతీష్‌కుమార్

చింతపల్లి, న్యూస్‌లీడర్
చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 22న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు చింతపల్లి ఏఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిఎంఆర్ రక్షా అకాడమీ ద్వారా సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. గిరిజన ప్రాంత నిరుద్యోగ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చేయూత-5 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిఎంఆర్, మల్టీనేషనల్ కంపెనీల్లో 300 సెక్యూరిటీ గార్డు, ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై, 165 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉన్న గిరిజన యువకులు అర్హులన్నారు. ఇప్పటికే 25 మందిని ఎంపిక చేశామన్నారు. ఆసక్తి గల యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. ఎంపికైన యువకులకు ఉచిత భోజన, వసతి కల్పించి మల్టీనేషనల్ జిఎంఆర్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

కోడిబరిలోకి దిగితే ఒప్పుకునేది లేదు


పరిశీలిస్తున్న ఎస్ఐ ఆదినారాయణరెడ్డి

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్: మండలంలోని గొందుపాలెం గ్రామంలోని భారీగా కోడి పందాలు నిర్వహించే స్థావరాలు ఏర్పాటు చేశారని, ముందస్తు చర్యలలో భాగంగా గుళ్ల ఆటలు, కోడి పందాలు నిర్వహిస్తే ఊరుకునేదిలేదని ఎస్.ఆదినారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 20వ వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, భారీగా జనాబా ఉన్న చోట ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే హెచ్చరిస్తున్నామని, అయినప్పటికీ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో పూర్తి స్థాయి గస్తీ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఆదినారాయణ అన్నారు.

నిర్వాసితుల ఉపాధికి గండి

అచ్యుతాపురం, న్యూస్‌లీడర్:
స్థానిక సెజ్ కేంద్రంలో అచ్యుతాపురం పరిశ్రమల రాకవల్ల కొన్ని కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కరువైంది ఇది ఇలా ఉండగా నూతనంగా నిర్మించబడిన పూడి వద్ద ఏషియన్ పెయింట్ రంగులు పరిశ్రమలో ఉపాధి ఉద్యోగాలు ఉంటాయని నిర్వాసితులు ఎంతగానో ఆశపడ్డారు. కానీ ఆశలన్నీ అడియాశలు అయినట్లు స్థానిక నిర్వాసితులు తెలిపారు. నిర్వాసితుల వద్దనుండి వారి భూములను తీసుకొని ఈ రంగుల పరిశ్రమలో చిన్నపాటి ఉద్యోగం కల్పించకుండా పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారికి పొరుగు జిల్లాల నుండి వచ్చిన వారికి ఈ కంపెనీలో ఉద్యోగాలు వారికి తప్ప స్థానిక నిర్వాసితులకు కన్నీరే మిగిల్చింది. ఏషియన్ పెయింట్ కంపెనీలో దళారులు గుత్తేదారులు పలుకుబడి ఉపయోగించి. వారిద్వారా ఇతర జిల్లాల వారికి ఉద్యోగాలు కల్పిస్తున్నారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. నిర్వాసితుల్లో ఎంతోమంది డిగ్రీలు ఐటిఐలు చేసి కంపెనీలు చుట్టూ తిరగడం తప్ప ప్రయోజనం కనబడలేదన్నారు. ఏషియన్ పెయింట్ కంపెనీలో ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని సెజ్ కంపెనీలు రంగుల పరిశ్రమలో అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని నిర్వాసితులు కోరుచున్నారు.



సీలేరు దారకొండ ఘాట్ రోడ్డుకు రూ.84 కోట్లు

సీలేరు, న్యూస్‌లీడర్
మండలంలోని ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు గల 75.6కిలో మీటర్ల రహదారి మరమ్మత్తు పనులు, వెడల్పు కోసం రూ.84 కోట్లు వెచ్చించేందుకు ఛీఫ్ ఇంజనీర్ ఆమోదించినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ద్వారా సమాచారం అందినట్లు బిజెపి పాడేరు అసెంబ్లీ కన్వీనర్ లోకులగాంధీ తెలిపారు. ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు రోడ్డు వెడల్పు కోసం విడుదలైన నిధులు ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడం వల్ల రెండేళ్లుగా జరగలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అంతర్‌రాష్ట్ర రహదారిలో నిత్యం ప్రమాదాలు సంభవించి అనేక మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సమస్య పరిష్కరించాలని ఈ నెల 5 నుంచి చేపట్టిన ఆమరణ దీక్షకు స్పందించి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, ఉన్నతాధికారులు సంక్రాంతి తర్వాత నెలాఖరులోగా రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు అర్జున్‌రెడ్డి, కె.జియారాణి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

దళిత సంఘాల ఆగ్రహం


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

మాడుగుల, న్యూస్‌లీడర్:
మాడుగుల మండలం వీరవల్లి అగ్రహారం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో గురువారం ఉదయం చోడవరం, దేవరాపల్లి, మాడుగుల, ముకుందపురం, వీరవల్లి అగ్రహారం గ్రామాలకు చెందిన దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట దోషులను శిక్షించాలంటూ ఆందోళన చేశారు. వడ్డాది నుంచి మాడుగుల, పాడేరు వెళ్లి వచ్చే బస్సులను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో దళిత సంఘాల నాయకులు శాంతించారు. దీంతో విషయం తెలిసిన చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, మాడుగుల ఎస్ఐ రాజాన ధనుంజయ్ దళిత సంఘాల మేరకు విచారణ చేపట్టారు. దోషులు ఎంతటివారైనా వదలిపెట్టేదిలేదని పోలీసు అధికారులు తెలిపారు. రాత్రి పండగలో గొడవలు జరిగాయని కొంత గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. దోషులపై చర్యలు వెంటనే తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తామని దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగులకు చెందిన అంబేద్కర్ యూత్, దళిత సంఘ నాయకులు దశరధరావు, చిక్కాల నాగరాజు, మరువాడ ఈశ్వరరావు, ఎంఎం దాసు, వేచలపు సహదేముడు, కుదర నాగేశ్వరరావు, పాము కామరాజు, వై.విజయ్‌కుమార్, డి.శ్రీను, కె.నర్సింగరావు, వినయ్ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న వైఎన్ భద్రం

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ప్రజలను మభ్యపెట్టి మోదీ, చంద్రబాబు ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నాలుగున్నరేళ్లగా చేయలేని, గుర్తుకు రాని సంక్షేమ పథకాలను అర్ధాంతరంగా ప్రకటించి ప్రజలను మభ్యపెట్టి మోసగించి వారి ఓట్లను గుంజు కోవాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాల నేతలు కుట్ర చేస్తున్నారని, విజ్ఞులైన ప్రజలు వారిని త్రిప్పి కొట్టాలని కోరారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ నాలుగున్నర సంవత్సరాలుగా పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్ను అమలు, రైతులు, కార్మికుల ఉద్యమాల అణిచివేత దోరణి అనుసరించి పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగించారన్నారు. ఇప్పుడు రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించి వారి ఓట్లను తిరిగి పొందడం ద్వారా తిరిగి అధికారంలోని కుట్ర పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, ఆదారి అప్పారావు, కోన లక్ష్మణ, తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

19న వృద్ధులకు గుర్తింపు కార్డుల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని గవరపాలెం నిదానందొడ్డి వీవీ రమణ రైతు భారతిలో గ్రామీణ వృయోవృద్ధుల ప్రజా సంక్షేమ సంఘం సమావేశం ఈ నెల 19వ తేదీన జరుగుతుందని సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. 60సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు, రాష్ట్ర ప్రభుత్వం వారు జారీ చేసిన గుర్తింపు కార్డులు జారీ చేయబడునని తెలిపారు. కార్డులు కావలసినవారు రెవెన్యూ స్టాంప్, స్టాంప్ సైజ్ చిన్న ఫొటోలు, ఆధార్‌కార్డు జెరెక్స్, గుర్తింపు కార్డు సమావేశానికి తీసుకొని రావాలని అప్పారావు కోరారు.

క్రీడల ద్వారానే నైపుణ్యం

నాతవరం, న్యూస్‌లీడర్
గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల నైపుణ్యం మెరుగుపడుతుందని నాతవరం ఎస్సై సత్యనారాయణ అన్నారు. మన్యపురట్ల పంచాయతీ శివారు లింగంపేట గ్రామంలో రెబల్ యూత్ సేవా సంఘం అధ్యక్షులు సుర్ల శ్రీను ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకొని మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ కార్యక్రమాలు పోలీసుశాఖ తరపున నిర్వహించాలని ఎస్పీ, ఏఎస్పీలు ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నాయి.

21న సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు

విజయనగరం, న్యూస్‌లీడర్: స్థానిక సంతపేట పురాతన శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ఈ నెల 21వ తేదీ పౌర్ణమి పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు లక్ష్మీనారాయణ సన్నిధిలో శ్రీసత్యన్నారాయణస్వామివారి సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నామని జగన్నాథ సేవా సమితి కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. ఇందులో పాల్గొనే దంపతులకు అన్నవరం సత్యనారాయణ స్వామి వారి ప్రతిమ, శేషవస్త్రాలు, ప్రసా దాలు అందజేస్తామని తెలిపారు. ప్రవేశరుసుం లేదని, పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9848145230 సంప్రదించమని కోరారు.

ఏరోస్పేస్ ఫెస్టివల్‌కు అనూహ్య స్పందన

ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు అధికారి ఎల్.శివశంకర్





సీతంపేట (శ్రీకాకుళం), న్యూస్‌లీడర్: ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్ కు అనూహ్య స్పందన లభించిందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల కార్యక్రమం సందర్భంగా పి.ఓ. మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నిర్వహించిన ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్ కు జిల్లా ప్రజలతో పాటు వివిధ జిల్లాల నుండి అనేక మంది పర్యాటకులు విచ్చేసారని తెలిపారు. జనవరి 13 నుండి 15 వ తేదీ వరకు ఉత్సవాలు జరపాలని నిశ్చయించడం జరిగిందని, ప్రజలందరూ ఈ ఫెస్టివల్ లో పాల్గొనడానికి అవకాశం కలిగించాలనే వుద్దేశ్యంతో 16వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. సాహసం చేయరా డింభకా... అనే నినాదంతో నిర్వహించిన ఈ క్రీడలలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడలకు ఎక్కువ మంది పాల్గొనుటకు ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. బుధవారం సంయుక్త కలెక్టరు వారి కుటుంబసభ్యులతో ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్ లో వుత్సాహంగా పాల్గొన్నారని, ప్రాజెక్టు అధికారి చెప్పారు. గత నాలుగు రోజులుగా నిర్వహించిన పారా మోటార్స్ రైడ్స్ లో 310 మంది, పారా సెయిలింగ్ లో 220 మంది, హాట్ ఎయిర్ బెలూన్ లో 70 మంది, వుత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా వుందని తెలిపారు. బుధవారం 15 వేల మంది విజిటర్స్ వచ్చారని, నాలుగు రోజులలో సుమారు 30 వేల మంది పర్యాటకులు సందర్శించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడలతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పి.ఓ. తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, తదితర అధికారులు హాజరైనారు. పాల్గొన్నారు.



జానపదాలు ఉత్తరాంధ్రుల సొంతం

సందడి చేసిన రేలారే రేలా బృందం



విజయనగరం, న్యూస్‌లీడర్: తెలుగుజాతి జానపదాలు ఉత్తరాంధ్ర ప్రజల సొంతమని డాక్టర్ పివిజి రాజు కళా వేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ అన్నారు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు సామాన్యులు వాడే పదాలు ఎక్కువగా జానపదాలే అని చెప్పారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగిరోజున కళావేదిక ఆధ్వర్యంలో రేలారే రేలా జానపదాల కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్రా జిల్లాల్లోని ప్రముఖ కళాకారులను ఆహ్వానించారు. కళావేదిక వేదికగా పలు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొంగలి పోతన్న హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటితరం యువతకి సంప్రదాయ క్రీడలు, జంగమయ్య పాటలు, హరిదాసుకీర్తనలు, గంగిరెద్దులవిన్యాసాలు ఏర్పాటుచేయడం అభినందనీయ మన్నారు. ఈ వేడుకల్లో భాగంగా పట్టణంలో వివిధ రంగాల్లో ప్రముఖులైన రాజేష్, బలివాడ అప్పారావు, కుసుమంచి సుబ్బారావు, ఎంపీపీ భోగాపురం కర్రోతు బంగార్రాజు, ఛైల్డ్‌లైన్ రాష్ట్ర ప్రతినిధి అప్పారావు, బీఎస్పీ నాయకుడు పివిరమణ, హరికథాకారిణి రాళ్లనిర్మల, వాలీబాల్, కబాడీ కోచ్‌లు జానకిరామ్, డప్పురాజు, శ్రీను, ఆటపాటలతో ఆహూతులను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో వేదిక కార్యదర్శి కొత్తా సునీల్, రాజారావు, నాగభూషణం, శ్రీను, అప్పారావు, లక్ష్మణ, పిఎల్ఎన్ రాజు, గురునాధం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 10 అనుబంధ విభాగాల అధ్యక్షులు ఖరారు

అమరావతి, న్యూస్‌లీడర్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ టిడిపి 10 అనుబంధ విభాగాలకు అధ్యక్షులను ఖరారు చేశారు. తెలుగుయువత: దేవినేని అవినాష్ (కృష్ణా జిల్లా), తెలుగు మహిళ: పోతుల సునీత(ప్రకాశం జిల్లా), తెలుగు రైతు: కంభం విజయ రామిరెడ్డి(నెల్లూరు జిల్లా), బిసి సెల్ : బోనబోయిన శ్రీనివాస యాదవ్(గుంటూరు), ఎస్ సి సెల్: ఎం ఎస్ రాజు(అనంతపురం జిల్లా) ఎస్ టి సెల్: ఎంవివి ప్రసాద్ (విశాఖపట్నం), మైనారిటీ సెల్: ఇంతియాజ్ అహ్మద్(కర్నూలు జిల్లా), క్రిస్టియన్ సెల్: మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యువల్ ఏ మనే (గుంటూరు), టిఎన్ టియూసి: బి నరేష్ కుమార్ రెడ్డి(చిత్తూరు), అంగన్ వాడి యూనియన్: భీమినేని వందనా దేవి (గుంటూరు జిల్లా).

ఘనంగా ఏడు గుళ్లు అమ్మవారి పరస

మల్కాపురం, న్యూస్‌లీడర్: జీవీఎంసి 49 వార్డు ప్రకాశ్ నగర వద్ద ఏడు గుళ్లు అమ్మవారి పరస బుధవారం ఘనం గా నిర్వహించారు ప్రతి సంవత్సరం కనుమ పండుగ రోజు ఏడు గుళ్లు అమ్మవారి పరస మల్కాపురం లో 16 కుల సంఘంలు పిఎంసీ క్లబ్ అద్వర్యం లో సేవగారడి సాముగారడి డాన్సులతో ఏడు గుళ్లు పరస ఘనంగా నిర్వహించరు ఏడు గుళ్లు అమ్మవారి ని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు సేకరించారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం

ఇద్దరు అరెస్ట్



పార్వతీపురం, న్యూస్‌లీడర్ : తమ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారంటూ సుడిగాం, బాలగుడబ గ్రామాలకు చెందిన యువకులు ఇచ్చిన సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ పోలీసులు ఎస్.ఐ వి.లోవరాజు ఆధ్వర్యంలో సుడిగాం, బాలగుడబ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుడిగాం గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పెదబండపల్లి గ్రామానికి చెందిన బాత.ఆనంద్ నుండి 18 మద్యం సీసాలను రూరల్ పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.


రూరల్ ఎస్.ఐ వి.లోవరాజు మాట్లాడుతూ బాలగుడబ, సుడిగాం గ్రామాలకు చెందిన కొంతమంది యువకులు ఇచ్చిన సమాచారం మేరకు ఆ గ్రామాల్లో రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న బాత.ఆనంద్, గంటా.సూర్యనారాయణ అనే వ్యక్తులు నుండి సుమారు 9 వేలు రూపాయిల విలువైన 62 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని,వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గెలుపు సులువు కాదా?

కోలగట్లకు వారే శత్రువులా
వర్గ పోరు కొంప ముంచనుందా
అధినేత ఆశీర్వదించినా కలసిరాని నేతలు



విజయనగరం, (న్యూస్‌లీడర్ ప్రతినిధి) విజయనగరం శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఒక విచిత్రమైన రాజకీయ పరిస్థితినెలకొంది. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో వైకాపాకు అనుకూలమైన వాతావరణం ఉంది. ఇందుకు అధికారపక్షానికి చెందిన నేతల స్వయంకృతాపరాధమే. రాష్ట్రమంతా తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఒకలా ఉంటే విజయనగరం జిల్లాలో ఇందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా విజయనగరం శాసనసభ నియోజకవర్గంలో అధికార పక్షమైన తెలుగుదేశం పార్టీకి ఎక్కడా కూడా అనుకూలమైన వాతావరణం కనిపించదు. నియోజకవర్గం పరిధిలోని పురపాలకసంఘ పాలకవర్గం, ఎమ్మెల్యే పనితీరుపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వారి పనితీరు పై ప్రజల్లోనే కాదు సాక్షాత్తు తెలుగు తమ్ముళ్ల మనసుల్లో కూడా పూర్తి వ్యతిరేకతే కనిపిస్తోంది. ఇది వైకాపాకు బాగా కలసివచ్చే అంశం. అంతే కాదు వైకాపా అధినేత జగన్ తన పాదయాత్రలో భాగంగా విజయనగరం అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి ని ప్రకటించారు. దీంతో ఈ నియోజకవర్గంలో వైకాపా ఎమ్మె ల్యే అభ్యర్థిగా కోలగట్ల విస్తృత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు.



దటీజ్ కోలగట్ల...

సాధారణంగా నేతలకు వారి పార్టీల ద్వారానే గుర్తింపు వస్తుంది. ఎన్నికల్లో కూడా పార్టీ జెండా, అజెండా ఆధారం చేసుకునే ఓట్లు పోలవుతుంటాయి. కానీ కోలగట్ల వీరభద్రస్వామి పరిస్థితి ఇందుకు భిన్నమైంది. ఆయన రూటే సపరేటు. ఆయన వల్ల పార్టీకి గుర్తింపు రావాలే కానీ పార్టీ వల్ల ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు అవసరముండదు. కోలగట్లకు రాజకీయపరంగా వ్యక్తిగత ఇమేజ్ ఉంది. సామాజిక రంగంలో కూడా ఆయనకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అన్ని వర్గాలవారీతో ఆయనకు ప్రత్యేక అనుబంధం కూడా ఉంది. ఈ కారణంగానే ఆయనకు ఎన్నికల్లో పోటీ చేసి గెలవటమంటే నల్లేరు మీద నడకలాంటిది. విశేషమేంటంటే ఆయన పార్టీపరంగా ఎప్పుడు పోటీ చేసినా ఓడిపోతూనే వచ్చారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు గెలుపొందారు. అది కూడా విజయనగరం సంస్థానాధీశులైన అశోక్‌గజపతి రాజుపై ఆయన విజయం సాధించారు. ఆయనకంటూ ఓ ప్రత్యేకవర్గముంది. ఆయన రాజకీయాలు వ్యూహాత్మకంగా చేస్తారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గం పరిధిలో ఒక విడత ప్రచారం పూర్తి చేసారు కూడా. ప్రజల్లో మమేకమయ్యే తపోమన ఆయన ఏ వర్గంతోనైనా ఇట్టే కలసిపోతారు. నిజానికి ఆయన ఈసారి ఎన్నికల్లో పోటీ చేయకూడదనే భావించారు. ప్రస్తుతం భాద్యతలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పదవి పూర్తయినతరువాత రాజకీయ విశ్రాంతం తీసుకోవాలనుకున్నారు. ఆయన ఇద్దరు కుమార్తెలకు కూడా అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. మరే భాద్యతలు ఆయనకు లేవు.ఇటువంటి పరిస్థితుల్లో వైకాపా అధినేత జగన్ ఆదేశాలతో కోలగట్లకు బరిలోకి దిగక తప్పలేదు. నిజానికి కోలగట్ల కాంగ్రెస్ పార్టీనుంచి వైకాపాలోకి చేరారు. ఆ వెనువెంటనే బొత్స సత్యనారాయణ వర్గం కూడా వైకాపాలో చేరింది. అక్కడే అసలు కథ పారంభమైంది. దీనిపై కోలగట్ల కినుక వహించారు. కానీ జగన్ మాత్రం కోలగట్లకే అత్యధిక ప్రాధాన్యతనిచ్చి కీలకమైన భాద్యతలప్పగించారు. పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్‌గా నిలబెట్టారు. విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా మీరుతప్ప మరెవ్వరూ పోటీ చేయలేరని జగన్ ఖరాకండీగా చెప్పేసారు. దీంతో కోలగట్ల పోటీ అనివార్యమైంది. ఇందుకు ఆయనేమీ వెనుకాడలేదు. రెట్టించిన ఉత్సాహంతో తన రాజకీయ వ్యూహానికి పదను పెట్టారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఆయనకెంతో అనుకూలంగా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీకిచెందిన ప్రజా ప్రతినిధుల వైఫల్యాలు కోలగట్ల విజయానికి ప్రధాన సోపానాలు.

అంత వీజీ కాదు




కాగా కోలగట్ల విజయం అంత వీజీకాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన గెలుపు తధ్యం. కానీ ఆయన ఓటమి అంచున ఉన్నట్లే. ఆవిషయం ఆయనకీ తెలుసు. ఎందుకంటే కోలగట్లకు ప్రత్యర్ధితో భయంలేదు. తెలుగుదేశం పార్టీనుంచి ఎవ్వరు బరిలోకి దిగుతారన్నదానిపై ఇంకా స్పష్టతలేదు. అశోక్‌గజపతిరాజే బరిలోకి దిగుతారని ఓసారి, కాదు ఆయన ద్వితీయ కుమార్తె అధితి రంగ ప్రవేశం చేస్తారని మరోసారి ప్రచారం జరుగుతోంది. ఇరువురిలో ఎవ్వరొచ్చినా ధీటుగా పోటీ ఇవ్వగల సత్తా కోలగట్లకుంది. జనసేన తరపున ఎవ్వరొచ్చినా ఆ పోటీ నామమాత్రమే, బిజెపి, కాంగ్రెస్‌కు నియోజకవర్గంలో ఉనికిలేదు. వామపక్షాలు తూతూ మంత్రమే. ఈవిషయాలన్నీ పక్కన పెడితే ఆయనకు అసలైన పోటీ స్వపక్షంలోని మరో వర్గమే. ఈవిషయంలోనే ఆయన తర్జనభర్జన పడుతున్నారు. పార్టీ పరంగా ఎప్పుడు పోటీ చేసినా ఆయన విజయంసాధించలేదు. ఇందుకు కారణం లేకపోలేదు.

కాంగ్రెస్ పార్టీలో మరో వర్గమే ఆయన

ఓటమికి కారణమయ్యేది. ఇప్పుడు ఆవర్గమే వైకాపాలోఉంది. అందుకనే కోలగట్లకు స్వపక్షమే విపక్షం.బొత్స వర్గీయం నియోజకవర్గం పరిధిలో తీవ్ర ప్రభావం చూపే వారిలో పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులున్నారు. మండలం పరిధిలో బొత్స సత్తిబాబు మేనల్లుడు చిన్నశ్రీను హవా ఉంది. నిజానికి ఇది పార్టీపరంగా కోలగట్లకు కలసిరావాలి. కానీ వర్గపోరు కోలగట్లను వెంటాడుతోంది. వీరు కనుక కార్డు తిరగేస్తే కోలగట్ల ఓడిపోతారు. ముందునుంచి అదే జరుగుతోంది. ఇప్పుడు అదే జరగదన్న గ్యారంటీ లేదు. అందుకనే కోలగట్ల సైతం ప్రత్యర్ధి ఎవ్వరూ అన్నది ఆలోచించడం లేదు. స్వపక్షంలో ప్రత్యర్ధులను ఎలా ఎదుర్కోవాలన్నదానిపైనే దృష్టి సారించలేదు. బహుసా ఈ కారణంగానే ఆయన సొంత క్యాడర్‌ను ఏర్పాటుచేసుకున్నారు. నియోజకవర్గం పరిధిలో బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసారు. ప్రతీ కమిటీలో తన నమ్మకస్థులను నియమించారు. వార్డులవారీగా, గ్రామాల వారీగా కమిటీలు వేసారు. ప్రతీ రోజు ఈ సమీక్ష జరుగుతోంది. ఎవ్వరెవ్వరి పరిస్థితేమిటన్న దానిపై డేగ కన్ను వేసారు. అయినా వర్గపోరు ఎటువైపునుంచి ఎలా ప్రభావం చూపిస్తుందన్న దానిపై మాత్రం ఎన్నికలయితే గానీ తెలియదు.అంతేకాదు నిన్న మొన్నటి వరకూ తాను పోటీచేయటం లేదని చెప్పుతూ వచ్చారు. ఇప్పుడు పోటీకి దిగారు. ఎందుకు తాను పోటీకి దిగాల్సివచ్చిందన్నది ప్రజలకు చెప్పుకోవాల్సిన భాద్యత కోలగట్లకుంది.కోలగట్ల ఇచ్చిన వివరణకు ప్రజల స్పందన ఎలా ఉందనేది ఎన్నికల తరువాత గానీ తెలియదు. దీనికితోడు ఇప్పటికే కోలగట్ల వర్గీయులపై మరోవర్గం వారు ఒక ముద్రవేసినట్లు సమాచారం. సెటిల్‌మెంట్లు, పైరవీలతో పబ్బం గడుపుకునే కోలగట్ల వర్గం అధికారంలోకి వస్తే పరిస్థితిఎలా ఉంటుందోఊహించుకోవచ్చన్న ఒక ప్రచారం చాపకింద నీరులా జరుగుతోంది. ఈ ప్రచారం ఎవ్వరు చేసారన్నది చెప్పనక్కరలేదు. కాబట్టి కోలగట్లకు తెలుగుదేశం, జనసేన ఇలా పార్టీ అభ్యర్ధులు పోటీ కాదు. వైకాపాలోనే ఆ వర్గమే ప్రధాన పోటీ అని రాజకీయ పరిశీలకులు చెప్పుకొస్తున్నారు. ఈనేపధ్యంలో కోలగట్ల గెలుపు అంత వీజీ కాదు.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : తూర్పుకోస్తా రైల్వే విశాఖ రైల్వేస్టేషన్‌ను రాజ్యసభసభ్యులు టి సుబ్బిరామిరెడ్డి అధ్యక్షతన పార్లమెంటరీ కమిటీ సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా స్టేషన్‌లో చెత్తడ, ప్లాస్టిక్ వ్యర్ధాల నిర్వహణతదితర అంశాలపై అధ్యయనం చేపడుతున్న నిర్వహణ పనులు పరిశీలించింది. ఈ సందర్భంగా డీఆర్ఎం ఎం ఎస్ మాధుర్ స్టేషన్‌లో చేపడుతున్న పనులు, చెత్త బుట్టలు, ప్లాస్టిక్ నీళ్లసీసాల క్రస్సింగ్, గోగ్రీన్ బిన్స్ యంత్రాల పనితీరు గురించి వివరించారు. పాలిథీన్ సంచుల నిషేధంపై ప్రయాణీకుల్లో అవగాహన కలిగించేలా చేపడుతున్న కార్యక్రమాలపైన, స్టేషన్‌లో మారనున్న వ్యవస్థల గురించి వివరించారు. ఈ.కో రైల్వే జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న సౌత్ ఈస్టర్న్ రైల్వే జిఎం పి.ఎన్.మిశ్రా, స్టేషన్‌లో ప్రయాణీకులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులతోపాటు అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే ఆంధ్రా అభివృద్ధి

డాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: కాంగ్రెస్ పార్టీతోనే ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోటవాసుదేవా రావు అన్నారు. సంకాత్రి పండుగ పర్వదినం పురష్కరించుకుని, అల్లిపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తారని, ప్రజలు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అన్యాయాలుపై మండిపడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు వాగ్ధానాలు తుంగలో తొక్కి రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా, రైల్వేజోన్ వంటి వాటిని విస్మరించారని అన్నారు. బీజేపీ ని ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో జరిగిని ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టి రాహుల్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. సామాన్యప్రజలను తీవసంక్షోభంలోకి నెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి త్వరలో కాలం చెల్లుతుందని, కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం రావాలని భగవంతుడిని కోరుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం వాసుదేవారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సాంప్రదాయంగా కనుమ పండుగ



లక్కవరపుకోట, న్యూస్‌లీడర్ : కనుమ పండుగను బుధవారం సాంప్రదాయకంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిని శోభాయమానంగా అలంకరించారు. పితృదేవతలకు పూజలు చేసి కొత్త దుస్తులు పెట్టారు. ఆపై ప్రతీ ఒక్కరూ కొత్త బట్టలు ధరించి సందడి చేసారు. పిండి వంటలు, శాఖాహార, మాంసాహార వంటలు వచ్చిన కొత్త అల్లుళ్లతో భుజించారు. హరి హరి నాయణో ఆదినారాయణో అంటూ సింహాచం నృసింహస్వామి స్వరూపమైన తోమడపెద్దులు వచ్చి భజన బృందాలు ప్రతి ఇంటి ముంగరకు వచ్చి భక్తిపాటలు పాడి దీవెనలు అందజేసాయి.అలాగై రైతు సోదరులంతా తమ పాడి పుశువులకు పసుపు కుంకుమలు రాసి అలంకరించారు.

చెరకు రైతులను ఆదుకోవాలి

బొబ్బిలి, న్యూస్‌లీడర్ : చెరకు రైతుల పరిస్థితి రోజు రోజుకు అధ్వాన స్థితిలో పడిపోతుందని, చెరకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ చక్కెర పరిశ్రమ నేడు దివాళ పరిశ్రమగా మారుతుందన్నారు. పరిశ్రమ యాజమాన్యం చెరకు రైతులకు గత కొన్ని సంవత్సరాల నుంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బొబ్బిలిలో ఉన్న ఒక్క లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యమే కాదు రాష్ట్రంలో ఉన్న అనేక పంచదార పరిశ్రమల పరిస్థితి కూడా ఇలానే ఉందన్నారు. ప్రభుత్వం పరిశ్రమలను పట్టించుకోకపోతే పరిశ్రమలు దివాళతీయడమో, మూడబడడమో జరుగుతుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చెరకు రైతుకు కొనుగోలు పన్ను ఒక టన్నుకు రూ.60 ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాలు ఇచ్చినట్టు సలహీ ధర రూ.500 ఇవ్వలన్నారు. రవాణ చార్జీలు ఫ్యాక్టరీ యాజమాన్యం భరించాలన్నారు. ప్రభుత్వాలు,యజమాన్యాలు రైతుకు సహకరిస్తే చెరకు ఉత్పత్తి పెరిగి, ఫ్యాక్టరీకి కావాల్సినంత చెరకు లభ్యమై లాభపడతారన్నారు. ఈ కార్యక్రమంలో చుక్క కూర్మినాయుడు, రెడ్డి సత్యంనాయుడు, రాంబార్కి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కనుమ

మక్కువ న్యూస్‌లీడర్: మండల ప్రజలు మంగళవారం సంక్రాంతి బుధవారం కనుమ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారంతా గ్రామాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇంటిల్లిపాది తమ కుల దైవాలకు పూజలు చేసారు. అలాగే పెద్దల పేరం టాళ్లను నూతన వస్త్రాలను చూపించారు. కాశీపట్నం పంచాయితీ ములక్కాయవలసలో గ్రామస్థులు రంగ వల్లుల పోటీ నిర్వహించారు. ఎస్ఐ. కె.కృష్ణ ప్రసాద్ మహిళలు వేసి ముగ్గులను పరిశీలించి విజేతలను ప్రకటించి బహుమతులు అందజేసారు. కనుమ రోజు యువత కబడ్డీ తదితర ఆటలాడుతూ సందడిగా గడిపారు.

సాలూరు రూరల్‌లో : సాలూరు,పాచిపెంట మండలాల్లో సాలూరు మున్సిపాలిటీలో ప్రజలు మంగళ,బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జామునే ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేసి ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు,పూలతో అలంకరించారు. సాలూరు మండలంలోని మామిడిపల్లిలో నిర్వహించిన రంగవలల్లు పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసారు.

మెంటాడలో.. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పెదచామలాపల్లిలో మాజీ సర్పంచ్ వైఎస్సుఆర్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి అప్పారావు ఆధ్వర్యంలో తాజా, మాజీ సర్పంచ్ రాయి,అదమ్మ అధ్యక్షతన పెద్దలు, యువత ఉద్యోగులు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. మహిళలు ఈ పోటీల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందక సూర్యారావు ఆధ్వర్యంలో విద్యార్ధులకు పాటలు, డ్యాన్స్ పోటీలు వ్యకృత్వ వికాసం,తదితర పోటీలు నిర్వహించి విజేతలకు నిఘంటవులు అందజేసారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసి గాంధీవిగ్రహాన్ని వైఎస్సారు సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాయి అప్పారావు ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ ఎద్దు అప్పారావు పాల్గొన్నారు. గుర్ల గ్రామంలో జేవీవీ రాష్ట్ర కళాకారుల సంఘం సభ్యుడు గంద్రేటి శ్రీనివాసరావు (డప్పు శ్రీను) సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను పాటలు రూపంలో వివరించారు.

సాంప్రదాయాలకు పెద్దపీట

బొండపల్లి, న్యూస్‌లీడర్: పల్లెల్లో సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు నెలవుగా నిలిచి రక్తసంబందీకులు అంతా ఒక్కచోట చేరి సంతోషాలకు నెలవుగా ఆనందాల నిలయంగా పండుగ జరుపుకున్నారు. పితృదేవతలను పూజించి ఆశీర్వాదాలు పొందారు. నూతన వస్త్రాలు, పిండివంటలు నైవేద్యంగా పెట్టిసహపంక్తి భోజనాలు ఆరగించారు. మరుగున పడుతున్న సాంప్రదాయాలు మళ్లీ గ్రామాల్లో పునరావృతం కావడంతో పెద్ద తరం సంబరాల్లో ముందునిలిచి ఆనందంగా గడిపారు. కనిమెరకలో రామాలయాల్లో సంబరాలు ఘనంగా చేపట్టి సహస్రదీపాలంకరణ చేపట్టారు. మహిళలు రామకీర్తనలు ఆలపిస్తూ ఇంటింటికీ దీపదర్శనం కల్పించారు.

క్రికెట్ టోర్నీ విజేత కొండ వెలగాడ

నెల్లిమర్ల, న్యూస్‌లీడర్: మండలంలో తరిమి గ్రామంలో ఎయిమ్స్ విద్యా సంస్థల అధినేత కడగల ఆనంద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో కొండవెలగాడ జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టుకు కడగల ఆనంద్ 20వేల రూపాయల నగదు బహుమతిని అందజేసి ప్రోత్సహించారు. జెడ్పిటీసీ సభ్యులు గదల సన్యాసినాయుడు కొండవెలగాడ గ్రామం తరపున బరిలోకి దిగి అత్యధిక స్కోర్ నమోదుచేసారు. ఈ టోర్నమెంట్‌కు మండల వ్యాప్తంగా 20 జట్లు హాజరు కాగా వీరిలో కొండవెలగాడ జట్టు ప్రధమ స్థానాన్ని కైవలం చేసుకుంది. ఈ సంధర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువకులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగపరచుకోవాలన్నారు.

వైభవంగా గంగమాంబ తీర్థ మహోత్సవం

శృంగవరపుకోట న్యూస్‌లీడర్ : మండలంలోని మామిడిపల్లి గంగ మాంబ తీర్థమహెూత్సవం వైభవంగా సాగింది. ఈ తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్లపందాలు, సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ తీర్థంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు నిఘా ఉంచారు. పండుగ మొత్తం ప్రశాంతంగా ముగిసింది.ఈ పండుగ నుంచే తీర్థాలు,జాతరలు ప్రారంభం కానున్నాయి.

ఎస్ఐ ప్రశాంత కుమార్ బదిలీ

కొత్తవలస, న్యూస్‌లీడర్ : కొత్తవలసలో పనిచేస్తున్న ఎస్ఐ ప్రశాంత కుమార్ ఎస్పీ పాలరాజు పార్వతీపురం టౌనుకు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఎఎస్ఐగా శిక్షణ పొందిన అనంతరం ఎస్సైగా బాధ్యతలు చేపట్టి కొత్తవలసలో మంచి అధికారిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు.

కొండపై సంక్రాంతి సందడి

మెంటాడ, న్యూస్‌లీడర్ : మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో కనుమ పండుగ కన్నుల విందుగా జరిగింది. గ్రామంలో చిన్న పెద్ద అనే తేడా లేకుండా గ్రామం కనుముతో పాటు బంధువులు ఇంటిలపాది పండుగ చివరి రోజున సాయంకాలం సమయంలో కొండపైకి ఎక్కి ఆనందించే ఆచారాన్ని ఎంతో కాలం నుంచి సాగిస్తున్నామని స్థానికులు తెలిపారు. సంవత్సరానికి ఒకమారు ఊరు బయట ఉన్న కొండపైకి పిల్లలతో ఎక్కి దిగడం ఎంతో ఆనందాన్నిస్తుందని, ఈ ఆనవాయితీ తాతల కాలం నుండి ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

పురాతన ఆలయంలో గుప్తనిధుల కలకలం

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కోటపల్లి మండలం నాగ్సాన్పల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకం కలకలం రేపింది. గ్రామానికి చెందిన కొంత మంది బయటి వ్యక్తులతో కలిసి పురాతన ఆలయం వద్ద తవ్వకాలు చేపట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. తవ్వకాల్లో రాగిపాత్రలు, నాణేలు, పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ విషయాన్ని నిర్ధరించడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు. లభ్యమైన వస్తువుల విలువ, నిందితుల వివరాలను గోప్యంగా ఉంచారు.

గట్టెక్కిన థెరెసా మే ప్రభుత్వం

19 ఓట్ల తేడాతో గెలుపొందిన కన్జర్వేటివ్ ప్రభుత్వం

లండన్ : బ్రిటన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నుంచి థెరెసా మే ప్రభుత్వం గట్టెక్కింది. ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి వైదొలగేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రెగ్జిట్ తీర్మానాన్ని నిన్న దిగువ సభ తిరస్కరించిన విషయం తెలిసిందే. తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ 432 మంది, ఆమోదిస్తూ 202 మంది ఎంపీలు ఓటు వేశారు. ప్రధాని సొంత పార్టీ అయిన కన్జర్వేటివ్కు చెందిన వందమందికిపైగా సభ్యులు కూడా తీర్మానాన్ని వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో ఆ వెంటనే ప్రధాని థెరెసా మేపై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. అయితే ఈ అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఓటింగ్లో 19 ఓట్ల తేడాతో కన్జర్వేటివ్ ప్రభుత్వం గెలుపొందింది. దీంతో బ్రెగ్జిట్ ఒప్పందంపై చర్చలకు రావాల్సిందిగా ప్రతిపక్ష నేతలను ప్రధాని థెరెసా ఆహ్వానించారు. ఈ ఒప్పందంపై వేగంగా నిర్ణయానికి రావాలని కోరారు.

షర్మిల కేసులో దర్యాప్తునకు ప్రత్యేక బృందం

హైదరాబాద్: వైఎస్ షర్మిల కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని సీసీఎస్ అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో పుకార్లు ప్రచారం చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. కేసుకు సంబంధించి సామాజిక మాధ్యమాల యజమానులకు లేఖలు రాశామన్నారు. పుకార్లు ప్రచారం చేసేవారి వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. 2014లో షర్మిలపై దుష్ప్రచారం చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేశామని రఘువీర్ వెల్లడించారు.

225 కోళ్లు.. 300 కోడి కత్తులు స్వాధీనం

విజయవాడలో పందెం రాయుళ్లపై పోలీసుల దాడులు



విజయవాడ: నగరంలో కత్తులు కట్టి కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. నగర వ్యాప్తంగా 420 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.2.96 లక్షల నగదు, 225 కోళ్లు, 300 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట, కోతముక్క ఆడుతున్న 115 మందిని అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న పది మందిపై కేసులు నమోదు చేసి రూ.12.36 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

24 గంటల్లోగా రూ.100కోట్లు జమ చేయండి

ఫోక్స్వాగన్ ఎన్జీటీ గట్టి ఆదేశాలు

దిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఫోక్స్వాగన్పై జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్గారాల కేసులో ట్రిబ్యునల్ ఆదేశించినా డబ్బు ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించింది. ఈ కేసులో ఇంకా సమయం ఇచ్చేది లేదని.. 24 గంటల్లోగా రూ. 100కోట్లు జమ చేయాల్సిందేనని ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది.

అసలేం జరిగిందంటే.. ఫోక్స్వాగన్ డీజిల్ కార్లలో ఉపయోగించే ఓ పరికరం కారణంగా పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని సంస్థపై ఉద్గారాల కేసు నమోదైంది. దీనిపై విచారించిన ఎన్జీటీ గతేడాది నవంబరు 16న ఫోక్స్వాగన్కు జరిమానా విధించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఖాతాలో రూ. 100 కోట్ల జమ చేయాలని ఆదేశించింది.

అయితే ఈ ఆదేశాలను పక్కనబెట్టిన సంస్థ ఇంతవరకూ ఆ డబ్బును జమ చేయలేదు. దీంతో ఈ వ్యవహారంపై నేడు మరోసారి విచారణ చేపట్టిన ఎన్జీటీ.. ఫోక్స్వాగన్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 'ఎన్జీటీ ఇచ్చిన తీర్పుపై ఎలాంటి స్టే లేకపోయినా మీరు డబ్బు ఎందుకు జమ చేయలేదు. ఇక మీకు ఎలాంటి గడువు ఇవ్వబోం. 24 గంటల్లోగా రూ. 100కోట్లు జమ చేయాల్సిందే. డబ్బు జమ చేసినట్లు శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా అఫిడవిట్ దాఖలు చేయండి' అని ఎన్జీటీ ఛైర్పర్సన్ ఆదర్శ్ కుమార్ గోయల్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.

లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. గడువు లోగా డబ్బు జమ చేయకపోతే ఫోక్స్వాగన్ ఇండి యా ఎండీని అరెస్టు చేయాల్సి వస్తుందని, అంతేగాక.. భారత్లోని కంపెనీ ఆస్తులను సీజ్ చేస్తామని స్పష్టం చేసింది.

హెచ్-1బీ వీసా దారులు దోపిడీకి గురవుతున్నారు

వెల్లడించిన అమెరికా థింక్-ట్యాంక్

వాషింగ్టన్: అమెరికాలో హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు చాలా సార్లు పని వాతావరణం ఏమాత్రం బాగుండట్లేదని, వేధింపులకు గురవుతున్నారని, పనికి తగిన వేతనం ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారని అమెరికాకు చెందిన ఓ సంస్థ వెల్లడించింది. ఈ ఉద్యోగాల విషయంలో.. జీతాల పెంపుతో పాటు పలు సంస్కరణలు తీసుకురావాలని సౌత్ ఏషియన్ సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ (థింక్-ట్యాంక్) అనే సంస్థ సూచించింది. ఈ వీసాలపై పనిచేసే వారికి మంచి పని వాతావరణం, ఉద్యోగ హక్కులు కల్పించాలని పేర్కొంది. హెచ్-1బీ వీసా విధానంలో మార్పులు తీసుకొస్తామని, మంచి సంస్కరణలు చేస్తామని, ప్రతిభావంతులు అమెరికాలో ఉండేందుకు మార్గం సుగమం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఈ సంస్థ ఉద్యోగ పరిస్థితులను చాలా మెరుగు పరచాలంటూ నివేదిక విడుదల చేసింది.

ప్రస్తుతం ఉన్న హెచ్-1బీ వీసా విధానం వల్ల అమె రికన్లకు హానీ జరగడంతో పాటు.. హెచ్-1బీ వీసాదారులు దోపిడీకి, వేధింపులకు గురవుతున్నారని, తగిన వేతనం ఇవ్వకుండా పని చేయించుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. వారికి తగిన వేతనంతో పాటు చక్కని పని వాతావరణం, ఉద్యోగ హక్కులు కల్పిస్తే ఇక్కడ వారి జీవితాలు మెరుగవుతాయని పేర్కొంది. ఈ వీసాల విషయంలో మొదట చేయాల్సిన పని జీతాలు పెంచడం అని తెలిపింది. అప్పుడే అత్యుత్తమ ప్రతిభావం తులు అమెరికాకు వస్తారని వెల్లడించింది. కంపెనీలు అమెరికన్లను కూడా తగినన్ని ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హతను బట్టి పదవులు ఇవ్వాలని తెలిపింది.

మూడో విడత పంచాయతీ నామినేషన్లకు 18వరకు గడువు

హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో చివరి విడత అయిన మూడో విడతలో నామినేషన్ల ఘట్టం శుక్రవారం ముగియనుంది. బుధవారం ప్రారంభమైన ఈ నామినేషన్ల ఘట్టం శుక్రవారంతో ముగియనుంది. మూడవ విడత నామినేషన్ల ఘట్టమైన బుధవారం భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇప్పటికే మొదటి, రెండో విడతలలో వేల సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇక మిగిలిన చివరి విడత నామినేషన్ల ఘట్టం శుక్రవారంతో ముగుస్తుంది. నామినేషన్లు పూర్తయిన తరువాత నామినేషన్ల పరిశీలన ఉంటుందని, ఆదివారం అప్పీల్ చేసు కోవడానికి అవకాశం ఉంటుంది. సోమవారం అప్పీల్లను పరిష్కరిస్తుం డగా, మంగళవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేది. ఇక ఎన్నికలు జనవరి 30వ తేదిన నిర్వహించడంతో పాటు ఫలితాలు అదే రోజు వెలువడనున్నాయి.

రెండో నామినేషన్ల ఉపసంహరణకు నేటితో తెర

పంచాయతీ ఎన్నికల్లో రెండో విడతలో నామినేషన్ల ఉపసంహరణకు గడువు గురువారంతో ముగియనుంది. కాగా రెండవ విడతలో మొత్తం 4135 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల అయింది. అందులో మూడు స్థానాలకు నామినేషన్లకు దాఖలు కాలేదు. అంటే 4132 స్థానాలకు సంబంధించి 20,575 మంది అభ్యర్థులు భరిలో ఉన్నారు. ఇక 36,602 వార్డు స్థానాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అయింది. 75 స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో మొత్తం 36527 స్థానాలకు 86,855 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. చివరి రోజు అయిన గురువారం ఎంత మంది నామినేషన్లు ఉపసంహరించుకుంటారో వేచి చూడాల్సిందే. జనవరి 25న ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఫలితాలు వెలువడుతాయి.

వివాదాస్పదమైన టైట్లర్ హాజరు



న్యూఢిల్లీ: ఢిల్లీ కాంగ్రెస్ విభాగం అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్ బాధ్యతలు స్వీకరించిన వేడుకకు ఆ పార్టీ సీనియర్ నేత జగదీశ్ టైట్లర్ హాజరు కావడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. సిక్కు వ్యతిరేక అల్లర్ల సాక్షులను బెదిరించేందుకే టైట్లర్ను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించిందని శిరోమణి అకాలీదళ్ నేత, ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్మెంట్ కమిటీ జనరల్ సెక్రెటరీ మజిందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంచిన జగదీశ్ టైట్లర్ను షీలా దీక్షిత్ మళ్లీ పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించి ఆయనకు అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని సిర్సా తీవ్రంగా విమర్శించారు. "1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన కేసులో సాక్షులను జగదీశ్ టైట్లర్ భయపెట్టారన్న సంగతి బహిరంగ రహస్యమే. అటువంటి వ్యక్తికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు. ఈ అల్లర్లకు సంబంధించి జగదీశ్ టైట్లర్ తోపాటుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్నాథ్కు కూడా జైలు శిక్ష పడుతుంది. సిక్కు అల్లర్ల కేసులో సాక్షులను బెదిరించేందుకు, టైట్లర్కు అధిష్టానం మద్దతు మెండుగా ఉందన్న సందేశాన్ని తెలియచెప్పేందుకే కాంగ్రెస్ పార్టీ ఇలా వ్యవహరించింది"అని ఆయన తన ట్విటర్లో పేర్కొన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ విభాగం అధ్యక్షురాలిగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ బుధవారం బాధ్యతల్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలు కరణ్సింగ్, జనార్దన్ ద్వివేది, మీరా కుమార్, పీసీ చాకో, సందీప్ దీక్షిత్, అజయ్ మాకెన్తో పాటుగా పార్టీ ఇతర ముఖ్యనేతలు కూడా హాజరయ్యారు. అయితే జగదీశ్ టైట్లర్ను ఆహ్వానించడాన్ని షీలా దీక్షిత్ సమర్థించుకున్నారు. 'ఆయన ఎందుకు రాకూడదు? ఆయనను ఇక్కడ మేము గౌరవించుకున్నామ'ని ఆమె వ్యాఖ్యానించారు. ఇందిర నుంచి రాహుల్ గాంధీ వరకు టైట్లర్ వారికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారని కేంద్రమంత్రి హర్సిమ్రత్ కౌర్ బాదల్ పేర్కొన్నారు. దీన్ని బట్టే సిక్కుల పట్ల కాంగ్రెస్ వైఖరి అర్థమవుతుందన్నారు.

నిజామాబాద్లో ఇన్నోవా బోల్తా...ఇద్దరు మృతి

డిచ్పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరు భువనేశ్వర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. మృతులు ప్రకాష్, చందాగా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కంచిరాజునగర్లో అగ్ని ప్రమాదం

తూర్పుగోదావరి : తూర్పుగోదావరి జిల్లా మండలకేంద్రం కరపలోని కంచిరాజు నగర్ లో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. అగ్ని ప్రమాదంలో 5 తాటాకిళ్ళు అగ్నికి ఆహుతయ్యాయి. కరెంటు షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో కోలని వారు భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఐదిళ్లు కాలి బుడిద య్యాయి. అదృష్టవశాత్తూ ఆ ఇళ్లలో ఒక వ్యక్తి మాత్రమే ఉండగా, మిగతా వారు తాళాలు వేసి ఊరికి వెళ్లారు. ఆ వ్యక్తిని స్థానికులు కాపాడారు. సమాచారం తెలిసిన వెంటనే మాజీ సర్పంచ్ పొలిశెట్టి తాతిలు, బ్రాహ్మణ కార్పొరేషన్ డిఎల్ ఓ డిహెచ్ వి సాంబ శివరావులు అక్కడకు చేరుకున్నారు. సమాచారాన్ని తహశీల్దార్ బూసి శ్రీదేవి ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మీ సత్తిబాబుకు తెలియచేసారు.

పాములు పట్టి జీవించే ముత్యాలు అనే వ్యక్తి ఇంట్లో రూ 5 వేలు నగదుతో పాటు 5 పాములు మంటల్లో కాలి చనిపోయాయి. వారికి కొంత నగదుతో పాటు కొంత అల్పాహారాన్ని సాంబశివరావు అందజేశారు. ప్రమాదంతో 5 కుటుంబాలకు చెందిన 13 మంది వీధిన పడ్డారు. దాదాపు 5 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చు అని అంచనా.

రెండు లారీలు, ఆర్టీసీ బస్సు ఢీ..

బస్సు డ్రైవర్కు తీవ్రగాయాలు

మహబూబ్నగర్: జిల్లాలోని దివిటిపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ఇవాళ ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు లారీ లు, ఓ ఆర్టీసీ బస్సు ఒకదాన్ని మరోటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు డ్రైవర్కు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు బస్సు డ్రైవర్ను జడ్చర్ల లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

బస్సు ఢీకొన్న లారీలో గ్యాస్ సిలిండర్లు ఉండటంతో బస్సులోని ప్రయాణి కులు భయాందోళనకు గుర్యాయారు. అవి పేలిపోతాయని భయపడ్డారు. వెంటనే బస్సు దిగి దూరంగా పరిగెత్తారు. సిలిండర్లు పేలక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోయాయి.

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు అమలు

గుంటూరు: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ మండల వాణిజ్య అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఓ రైలు ఈనెల 20 నుంచి 30 వరకు, మరో రైలు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 1 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గూడూరు జంక్షన్లో పలు ఇంజనీరింగ్ పనులు చేపడుతుండడంతో రద్దు అనివార్యమైందని వివరించారు. ఈ కారణంగా గుంటూరులో 12.10 గంటలకు బయలుదేరి డోన్కు వెళ్లే రైలు(57328) ఈనెల 31 వరకు, డోన్లో 6.30కి బయలుదేరి గుంటూరు వచ్చే రైలుని(57327) వచ్చే నెల 1 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరులో 5.15కి బయలుదేరి కాచిగూడ వెళ్లే రైలు (77281)ని గుంటూరు-డోన్ మధ్య ఈనెల 31 వరకు, కాచిగూడలో 5.10కి బయలుదేరి గుంటూరు వచ్చే రైలు (77282)ని డోన్-గుంటూరు మధ్య ఈనెల 31 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. అలాగే రేపల్లెలో 4 గంటలకు బయలుదేరి మార్కాపురం వెళ్లే రైలు(77247) గుంటూరు-మార్కాపురం మధ్య, మార్కాపురంలో 10.05కి బయలుదేరి తెనాలి వెళ్లే రైలు(77249)ని మార్కాపురం-గుంటూరు మధ్య ఈనెల 21 నుంచి 31 వరకు రద్దు చేసినట్లు వివరించారు. ఇక గుంటూరులో ఒంటి గంటకు బయలుదేరి తిరుపతికి వెళ్లే రైలు(67232)ని బిట్రగుంట-తిరుపతి మధ్య ఈ నెల 31 వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు చెప్పారు. తిరుపతిలో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి గుంటూరు వచ్చే రైలు (67231)ని తిరుపతి-బిట్రగుంట మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు వివరించారు.

32 రోజులుగా గనిలో చిక్కుకున్న 15 మంది గని కార్మికులు..

ఓ మృతదేహం లభ్యం



మేఘాలయ: మేఘాలయలోని ఓ గనిలో నెల రోజులుగా చిక్కుకుపోయిన 15 మంది గని కార్మికులను వెలికి తీసుకొచ్చేందుకు సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున ఓ కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీశారు. గనిలో 200 అడుగుల లోపల అతడి మృతదేహాన్ని గుర్తించి సహాయక సిబ్బంది దానిని వెలికి తీసుకొచ్చారు. మిగతా 14 మంది కోసం సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నేవీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ను ముమ్మరం చేశాయి. మంగళవారం మైనర్ మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది ఈ ఉదయం డైవర్ల సాయంతో వెలికి తీశారు. గనిలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ఇప్పటి వరకు కోటి లీటర్ల నీటిని బయటకు తోడినా ఫలితం లేకుండా పోయింది. నీటిని ఎంత తోడినా మళ్లీ పెరుగుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్టు అధికారులు తెలిపారు. సమీపంలోనే మూసివేసిన గని నుంచి మరో రెండు కోట్ల లీటర్ల నీటిని బయటకు పంప్ చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ నీటి ప్రవాహం తగ్గడం లేదని, నీరు ఎక్కడి నుంచి వస్తోందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేఘాలయలోని ఈస్ట్ జైంటియా జిల్లాలో లిటీన్ నది సమీపంలో అక్రమంగా నడుస్తున్న గనిలో కార్మికులు చిక్కుకుపోయారు. డిసెంబరు 13న ఈ ఘటన జరగ్గా.. విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే అధికారులు సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు.


గుడిలో సినీ నిర్మాత ఆత్మహత్య

ముంబై : మరాఠీ సినీ నిర్మాత, కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు సదానంద్ లాడ్ అలియాస్ పప్పు లాడ్ ముంబైలోని ఓ దేవాలయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన చోటు చేసు కుంది. ప్రముఖ బిల్డర్ వేధింపులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పప్పు లాడ్(58) ముంబైలోని గిర్గాంలో తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. తన ఇంటి సమీపంలో ఉన్న గణపతి దేవాలయానికి ప్రతి రోజు వెళ్తుంటారు. బుధవారం ఉదయం ఒక్కరే ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం ఆలయ పూజారికితో కాసేపు మాట్లాడి, పక్కన ఉన్న గదిలో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి వెళ్లారు. కాసేపటి తర్వాత ఏదో అవసర నిమిత్తం పూజారి ఆ గదిలోకి వెళ్లి చూడగా సదానంద్ ఫ్యాన్కు వేలాడుతూ కన్పించారు. వెంటనే పూజారి పక్కన ఉన్న వారికి సమాచారం ఇచ్చి తలుపులు తెరచి చూడగా అప్పటికే ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో సూసైడ్ నోట్ లభించిందని పోలీసులు తెలిపారు. ప్రముఖ బిల్డర్ వేధింపుల కారణంగా సదానంద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. కాగా ఆత్మహత్య విషయం తెలుసుకున్న సదానంద్ కుటుంబీకులు కన్నీరుమున్నీ రయ్యారు. తమకు ఎంతో ధైర్యాన్ని ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారంటే నమ్మశక్యంగా లేదన్నారు. సదానంద్ మరాఠీలో 12 చిత్రాలను పైగా నిర్మించారు.




ఖాళీ కొబ్బరి చిప్ప రూ.1,400!

ట్విటర్లో పంచుకున్న ఐపీఎస్ అధికారి



ఇంటర్నెట్డెస్క్: సాధారణంగా కొబ్బరికాయ సుమారు రూ.20 నుంచి రూ.30 వరకూ ఉంటుంది కదా..! కాయ నుంచి తీసిన ఖాళీ చిప్పలు అంతకంటే తక్కువకే లభ్యమవుతాయి. మరి రూ.1,400 ధర ఏంటని ఆశ్చర్యపోతున్నారా..? ఓ ఖాళీ చిప్ప ఖరీదు అమెజాన్లో ఇంతే ఉంది మరి! కనీసం దానికి ప్రత్యేక రంగులు, ఇతర హంగులేమీ అద్దలేదు. ఈ సహజ కొబ్బరి చిప్పను ఆన్లైన్లో చూసిన ఐపీఎస్ అధికారి రెమా రాజేశ్వరి ఆశ్చర్యపోయి దాన్ని ట్విటర్లో పంచుకున్నారు. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్ను పోస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. ఈ చిప్ప అసలు ఖరీదు రూ.3 వేలట. 55 శాతం ఆఫర్లో భాగంగా రూ.1,365కి లభిస్తోంది. పైగా దీని సైజు కూడా ఒకటిన్నర అంగుళాల ఎత్తు, నాలుగున్నర అంగుళాల వెడల్పు మాత్రమే. ఓ వంద మిల్లీ లీటర్ల నీళ్లు పట్టేంత ఖాళీ మాత్రమే ఉంటుంది. ఇటీవలి కాలంలో కొబ్బరి చిప్పలతో చేసిన బౌల్స్ వాడడం ట్రెండ్గా మారింది. కొబ్బరి చిప్పలను పాలిష్ చేసి, అందమైన రంగులోకి మలుస్తున్న చిప్పలు చాలా మందిని ఆకర్షిస్తున్నాయి. కానీ ఇవి ఒక్కొక్కటీ రూ.100లోపే ఉంటున్నాయి. మరి సాధారణ కొబ్బరి చిప్పను ఏకంగా రూ.1,365కు అమ్మడం మాత్రం నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఐపీఎస్ అధికారి రెమా రాజేశ్వరి ట్వీట్పైనా నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

కమ్యూనిస్టు కురువృద్ధుడు కేఎల్ మృతి



ఖమ్మం: కమ్యూనిస్టు కురువృద్ధుడు, తెలంగాణ సాయుధపోరాట యోధుడు కాకి లక్ష్మారెడ్డి(కేఎల్) బుధవారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. 1930వ సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆత్మకూర్ మండలం రావిపహాడ్ గ్రామంలో జన్మించారు. 18 ఏండ్ల వయస్సులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కేఎల్ తన 91 ఏండ్ల పాటు సుదీర్ఘకాలం జీవిత చరమాంకం వరకు కమ్యూనిస్టుగానే జీవించారు. 1969వ సంవత్సరంలో మిర్యాలగూడ పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు. 2000 సంవత్సరంలో కరీంనగర్ జిల్లా మెట్పల్లి నుంచి జనశక్తి పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కమ్యూనిస్టుగా అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న కేఎల్ అంత్యక్రియలు గురువారం స్వగ్రామం అమర్నగర్, హుజూర్నగర్ మండలం సూర్యాపేట జిల్లాలో జరపనున్నట్లు కేఎల్ కుమారుడు కాకి భాస్కర్ తెలిపారు.


జల్లికట్టులో 43మందికి గాయాలు



మధురై: సంక్రాంతి పండగ సందర్భంగా తమిళనాడులో నిర్వహించే జల్లికట్టు క్రీడలో సుమారు 43 మంది గాయపడ్డారు. మధురై జిల్లాలో జల్లికట్టు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎద్దులు ఆటలో పాల్గొనేవారిపైకి, ప్రేక్షకులపైకి దూసుకు రావడంతో 43 మంది గాయపడ్డారు. దాదాపు వెయ్యి ఎద్దులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈరోజు మధురైలో జరిగిన కార్యక్రమంలో గెలిచిన వారికి బంగారు నాణే లు, బైక్స్, కారు కూడా బహుమతులుగా ఇస్తామని నిర్వాహకులు ప్రకటిం చారు. తమిళనాడులో సంప్రదా య క్రీడ అయిన జల్లి కట్టును సుప్రీంకోర్టు 2015లో నిషేధించింది. పశువులను హింసిస్తున్నారని ఆ క్రీడ ఆడొద్దని తీర్పు చెప్పింది. దీంతో చెన్నైలోని మెరీనా బీచ్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. తమ రాష్ట్ర సంప్రదాయ క్రీడను నిషేధించొద్దని ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరి నిరసనలు తెలిపారు. దీంతో చట్టానికి సవరణలు చేసి 2016లో నిషేధం ఎత్తేశారు. సోమవారం జరిగిన జల్లికట్టు ఉత్సవాల్లో 49మంది గాయపడ్డారు. ఈరోజు 43 మంది గాయాలపాలయ్యారు. కొందరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గురువారం మధురై లోని అళంగనల్లూర్లో చాలా పెద్ద జల్లికట్టు కార్యక్రమం జరగనుంది. జల్లికట్టు ఆడుతూ ఎద్దుల కొమ్ములు తగిలి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చాలా ఉన్నాయి. గడిచిన రెండు దశాబ్దాలలో 200మంది చనిపోయారు.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
శుక్రవారం 18-1-2019

మరోసారి శంకర్‌తో అక్షయ్‌కుమార్



భారీ చిత్రాల దర్శకుడు శంకర్ రజనీకాంత్ తో '2.0' తర్వాత కమల్ హాసన్ తో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 1994 లో సూపర్ హిట్ గా నిలిచిన 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్ గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు శంకర్. ఈమధ్యే ఈ సినిమా ఫస్ట్ లుక్ కూడా విడుదల చేసిన శంకర్ త్వరలో ఫోకస్ పెడుతున్నానని వెల్లడించాడు. తాజాగా ఈ సినిమా గురించి బాలీవుడ్ మీడియాలో ఒక వార్త హల్ చల్ చేస్తోంది. ఈ సినిమాలో విలన్ పాత్రకు శంకర్ అక్షయ్ కుమార్ ను ఎంచుకున్నాడట. '2.0' సినిమాలో అక్షయ్ కుమార్ విలన్ పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. నిజానికి రజనీ పాత్ర కంటే అక్షయ్ కుమార్ పోషించిన పాత్రకే ఎక్కువ ప్రశంసలు దక్కాయి. ఈ సినిమాకు పని చేసిన తర్వాత శంకర్ వర్క్ తో ఇంప్రెస్ అయిన అక్షయ్ మంచి పాత్ర ఉంటే మరోసారి కలిసి పనిచేద్దామని అన్నాడట. 'ఇండియన్ 2' లో మొదట విలన్ పాత్రకు అజయ్‌దేవగణ్‌ను అనుకున్నాడట శంకర్. కానీ అయన ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండడంతో ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రకు అక్షయ్‌కుమార్‌నే సంప్రదించాడని సమాచారం. అంతా సవ్యంగా జరిగితే ఇండియన్ కు కెనడియన్ విలన్ సెట్ అవుతుదాన్న మాట. ఏంటి అర్థం కాలేదా? కొంత మందికే తెలిసిన విషయం ఏంటంటే అక్షయ్ కుమార్ కు ఇండియన్ సిటిజెన్ షిప్ లేదు. అయన కెనడియన్. డౌట్ ఉంటే వికీపీడియా చూడండి!

ఏప్రిల్ 26న మహర్షి రాక



మహేష్ బాబు సినిమా అంటే జానర్ ఏదైనా సరే అంచనాలు ఆకాశాన్ని దాటడం సహజం. అందులోనూ క్రేజీ కాంబినేషన్ అంటే వేరే చెప్పాలా. అయితే షూటింగ్ మొదలు పెట్టిన టైం లో ఏప్రిల్ 5 విడుదలంటూ ముందు నుంచి ఊరిస్తూ వచ్చిన మహర్షి టీం ఇప్పుడు హటాత్తుగా మాట మార్చిన సంగతి తెలిసిందే. దీని పట్ల మహేష్ ఫ్యాన్స్ బాగా అసహనంతో ఉన్నారు. డిసెంబర్ నుంచే సోషల్ మీడియాలో వంద రోజుల కౌంట్ డౌన్ అంటూ మొదలు పెట్టి పాపం సంబరంగా ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పుడా ఆశలకు నీళ్ళు పడ్డాయి. అయితే దీనికి నిర్మాత నుంచి వినిపిస్తున్న కారణం భలే వింతగా ఉంది. ఏప్రిల్ మొదటివారం కంటే చివరి వారం అయితేనే సెంటిమెంట్ గా మహేష్ కు కలిసి వస్తుందట. గత ఏడాది వచ్చిన భరత్ అనే నేనుని ఉదాహరణగా చూపుతున్నారు. అయితే అది వచ్చింది మూడో వారంలో. పోకిరిని కూడా ఎగ్జాంపుల్ గా చెబుతున్నారు లెండి. ముగ్గురు నిర్మాతలున్నా కీలకమైన బాధ్యతలు మోస్తున్న దిల్ రాజు టీమ్ చెబుతున్న వెర్షన్ లో చిన్న లాజిక్ మిస్ అవుతోంది. మహేష్ లాంటి స్టార్ హీరోల సినిమాలకు సీజన్ తో సంబంధం లేదు. కంటెంట్ ఉంటే ఎప్పుడు వచ్చినా దుమ్ము దులుపుతాయి. ఇది అందరికి వర్తిస్తుంది. రంగస్థలం మార్చి చివరి వారంలో వచ్చి నాన్ బాహుబలి రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం మర్చిపోకూడదు. అయినా సెంటిమెంట్ల ప్రకారం డేట్లు చూసుకోవడం సహజమే కానీ మరీ ఫలానా టైంలోనే వస్తే హిట్ అవుతాయి అని చెప్పుకోవడం మాత్రం లాజిక్ కి దూరంగా ఉంది బాసూ. సరే ఏప్రిల్ 26 అంటూ అనధికారికంగా డేట్ చెబుతున్నారు.

నటననేది ఇన్వెస్టిగేషన్



తెలుగులో బాలకృష్ణ లెజెండ్ తో మంచి గుర్తింపే తెచ్చుకున్నా రాధిక ఆప్టేకు టాలీవుడ్ లో పెద్దగా ఆఫర్లు కలిసి రాలేదు. తర్వాత బాలీవుడ్ కు వెళ్ళిపోయి గ్లామర్ రోల్స్ తో పాటు బోల్డ్ గా నటించేందుకు ఏ మాత్రం మొహమాటం పడకపోవడంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఓ సినిమాలో నగ్నంగా నటించేందుకు సైతం వెనుకాడకపోవడంతో ఫాలోయర్స్ సంఖ్య అమాంతం పెరిగింది. ఇటీవలి కాలంలో నెట్ ఫ్లిక్స్ నిర్మిస్తున్న అన్ని వెబ్ మూవీస్ లోనూ కనిపిస్తున్న రాధిక ఆప్టే మీద సదరు సంస్థ మీద సోషల్ మీడియాలో జోకులు కనిపిస్తూనే ఉంటాయి. ఆఫ్ కోర్స్ వాళ్ళూ వీటిని స్పోర్టివ్ గా తీసుకుని ఎంజాయ్ చేస్తున్నారు లెండి. ఇదిలా ఉంచితే రాధికా ఆప్టే కొత్త ఇండిపెండెంట్ మూవీ బాంబరియా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్ లో చురుగ్గా పాల్గొంటున్న రాధికా ఆప్టే నటన గురించి కొత్త సంగతులు చెబుతోంది. తనకెపుడూ ఆసక్తి రేపే స్పూర్తిదాయకమైన పని ఇష్టమని చెబుతున్న రాధికా నిత్యం ఏదో ఒకటి అన్వేషించేలా జీవితం లేకపోతే ఛాలెంజింగ్ రోల్స్ చేయలేమని చెబుతోంది. కామెడీ మిస్టరీ నేపథ్యంలో రూపొందుతున్న బాంబరియా ట్రైలర్ ఇటీవలే విడుదలై మంచి స్పందన దక్కించుకుంది. సిద్దార్థ్ కపూర్-అక్షయ్ ఒబెరాయ్-ఆదిల్ హుసేన్-శిల్ప శుక్లా తదితరులు నటించిన ఈ మూవీ మూడు జీవితాలకు సంబంధించిన ఓ కీలకమైన సంఘటన చుట్టూ తిరుగుతుంది. అదేంటో తెరమీద చూసి ఎంజాయ్ చేయమంటోంది రాధికా ఆప్టే. విదేశీ ప్రియుడితో డేటింగ్ లో ఉన్న రాధికా దాని గురించి ప్రస్తావిస్తే మాత్రం ఆ ఒక్కటి అడక్కు అని చెబుతోంది. గత ఏడాది మంచి సక్సెస్ లతో జోరుమీదున్న రాధికా ఆప్టే ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందన్న నమ్మకంతో ఉంది.

చిత్రకళతో అద్భుతాలు

మాడుగుల మోదమాంబ కాలనీకి చెందిన చదలవాడ వెంకటేష్









మాడుగుల, న్యూస్‌లీడర్ : మాడుగుల మోదమాంబ కాలనీకి చెందిన చదలవాడ వెంకటేష్ చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై శ్రద్ధ చూపించడంతో అతని తల్లిదండ్రులు చదలవాడ సుధాకర్, జయలక్ష్మి చిత్రకళను చూసి ప్రోత్సహించారు. తల్లిదండ్రుల సహకారంతో ఎన్నో అద్భుత చిత్రాలకు రూపకల్పన చేసిన వెంకటేష్ ప్రతిభను గుర్తించి కడప యోగివేమన యూనివర్సిటీ పెయింటింగ్ ఫ్యాకల్టీగా నియమించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు విశాఖ, బొంబాయి, విజయవాడ, గుంటూరు, తెనాలి పట్టణాల్లో జరిగిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లో చిత్రాలు ప్రదర్శనకు ఉంచానన్నారు. బొంబాయి ఆర్ట్ సొసైటీ, అమరావతి ఆర్ట్ సొసైటీ, కోనసీమ చిత్రకళ పరిషత్ పెయింటింగ్ కాంపిటేషన్‌లో ప్రథమ విజేతగా నిలిచానని తెలిపారు. విజయవాడ కల్చరల్ డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి తన చిత్రాలను చూసి ముగ్ధులై ఘనంగా సన్మానించారన్నారు. తనను ప్రోత్స హించిన చిత్ర కళ ఉపాధ్యాయులు కోట మృత్యుంజయరావుకు, తల్లి దండ్రులకు ఎప్పటికి రుణ పడి ఉంటానని చెప్పారు.















కెథరిన్‌కు బిగ్ ఆఫర్



ఏ ఫర్ యాపిల్.. పి ఫర్ పామోలివ్! అంటోంది కేథరిన్ థ్రెస్సా. ఈ బ్యూటీ గత కొంతకాలంగా టాలీవుడ్ సర్కిల్స్ లో కనిపించకపోయినా కెరీర్ పరంగా ఖాళీగా ఏం లేదు. ఓవైపు వాణిజ్య ప్రకటనలతో బిజీగా ఉంటూనే కథానాయికగానూ అడపా దడపా అవకాశాలు అందుకుంటోంది. కేథరిన్ ప్రస్తుతం తమిళం - మలయాళ చిత్రాలతో బిజీగా ఉంది. తదుపరి వంత రాజవథాన్ వరువేన్ (అత్తారింటికి దారేది రీమేక్) రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ చిత్రంలో సింబు కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ సినిమా సెట్స్ పై ఉండగానే పామోలివ్ బ్రాండ్ అంబాసిడర్ గా సంతకం చేసింది. అందుకు సంబంధించిన టీవీ కమర్షియల్ ఇప్పటికే చిత్రీకరించారు. ఇందులో కేథరిన్ అందచందాల ఎలివేషన్ వీక్షకుల మతి చెడగొడుతోంది. తడిపొడి అందాలతో ఈ అమ్మడు గుబులు రేకెత్తిస్తోంది. ఇకపోతే సరైనోడు చిత్రంలో ఎమ్మెల్యగా అలరించిన కేథరిన్ అటుపైనా బోయపాటి తెరకెక్కించిన జయ జానకి నాయికలో ఏ ఫర్ యాపిల్... అంటూ వేడెక్కించే ఐటెమ్ నంబర్ లో నర్తించింది. మల్లూ వుడ్ లోనూ వేడెక్కించే పలు చిత్రాల్లో నటిస్తోంది అమ్మడు.



ఎమ్మెల్యేగా రంగమ్మత్త

రంగస్థలంలో రంగమ్మత్తగా గుండె జిల్లనిపించింది అనసూయత్త. సూయ సూయ అంటూ బోయ్స్ వెంటపడే రేంజు రంగమ్మత్తది. అందుకే ఈ బుల్లితెర హాట్ యాంకర్ ఏ పని చేసినా జనం ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తుంటారు. ఈసారి పెద్ద తెరపై అనసూయను ఎలాంటి పాత్రలో చూసేందుకు వీలుంది? అంటే.. యువ ఎమ్మెల్యేగా కనులారా వీక్షించే వీలుందని తెలుస్తోంది. వైయస్సార్ పాదయాత్ర ఆధారంగా రూపొందిస్తున్న యాత్ర చిత్రంలో అనసూయ ఓ కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో కర్నూలు జిల్లా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాత్రలో అనసూయ కనిపించనుందిట. రాజకీయాల్లో గౌరు హిస్టరీ చాలా ఆసక్తి రేకెత్తించేదే. 2004 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన గౌరు చరితారెడ్డి ఒకసారి నంది కొట్కూర్ నుంచి ఇంకోసారి పాణ్యం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఐదుసార్లు ఓటమి అన్నదే తెలియని కాటసానిపైనే గెలుపొందారు. యాత్ర ఈ ఫిబ్రవరిలో రిలీజవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో యంగ్ ఎమ్మెల్యేగా అనసూయ నటన ఎలా ఉంటుందో తెరపై చూడాల్సిందే. ఇటీవలే రిలీజైన ఎఫ్ 2 చిత్రంలో అనసూయ ఓ పాటలో అందాల విందు చేసిన సంగతి తెలిసిందే. ప్రాధాన్యత లేని పాత్రలో నటించి నందకు అనసూయ అభిమానులు చిన్నబుచ్చుకున్నారు. ఇక యాత్రలో ఆ లోటును పూడ్చే పాత్రలో తనని చూడొచ్చన్నమాట. యాత్ర చిత్రంలో వైయస్సార్ పాత్రలో మమ్ముట్టి నటిస్తున్నారు. ఇతర కీలక పాత్రలకు టాప్ స్టార్లను ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. మహి.వి.రాఘవ్ దర్శకత్వం వహిస్తున్నారు.

నన్ను ఎవరూ అప్రోచ్ అవలేదు



రకుల్ ప్రీత్ సింగ్ ఈమధ్య తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదుగానీ తన ఫోకస్ అంతా తమిళ.. హిందీ భాషలపై పెట్టింది. ఎన్టీఆర్ బయోపిక్ లో శ్రీదేవి పాత్రలో కనిపించినా.. ఆ క్యామియో వల్ల రకుల్ కు కొత్తగా వచ్చిందేమీ లేదు. ఇది కాకుండా ఒక్క స్ట్రెయిట్ తెలుగు సినిమాలో కూడా రకుల్ నటించడం లేదు. ఇదిలా ఉంటే ఈ మధ్య రకుల్ కు సంబంధించిన ఒక వార్త హల్చల్ చేసింది. 'కేజీఎఫ్' లో రకుల్ కు ఐటమ్ సాంగ్ చేసే అవకాశం వచ్చినా రిజెక్ట్ చేసిందని అన్నారు. రకుల్ నో చెప్తేనే ఆ ఐటెమ్ నెంబర్ మిల్కీ బ్యూటీ తమన్నాకు వెళ్ళిందట. తమన్నా మాత్రం నో చెప్పకుండా ఎస్ అని చెప్పేసింది. ఇదే విషయంపై అమ్మడిని ఆరా తీస్తే రకుల్ అదో రూమర్ అని కొట్టిపారేసింది. అంతటితో ఆగకుండా తనకు 'కేజీఎఫ్' లో ఐటెం సాంగ్ చేసే అవకాశం రాలేదని.. ఒకవేళ అవకాశం వస్తే ఎందుకు వద్దంటానని చెప్పు కొచ్చింది. అయినా ఐటమ్ సాంగ్స్ లో నటిస్తే తప్పేముందని ప్రశ్నించింది. నిజమే.. ఈ తరం హీరోయిన్లలో చాలమంది ఐటమ్ సాంగ్స్ లో నటించేందుకు వెనక డుగు వేయడం లేదు. పైగా రెండు మూడు రోజుల కాల్ షీట్స్ తోనే భారీగా డబ్బు ముడుతుంటే ఎవరైనా ఎందుకు వద్దంటారు లెండి. పైగా సాంగ్ హిట్ అయితే అదోరకమైన క్రేజు.. డబ్బెవరికి చేదు.. క్రేజ్ ఎవరికి వద్దు?

చిలిపిగా రుహానీ శర్మ



'చిలసౌ' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుహాని శర్మ ఒక మిడిల్ క్లాస్ అమ్మాయి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత పెద్దగా ఆఫర్లు రాలేదుగానీ సోషల్ మీడియాలో మాత్రం హాట్ ఫోటోలతో ఫిలిం మేకర్లకు గ్లామర్ షోకు రెడీ అని ఇండికేషన్స్ ఇస్తోంది. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా రుహాని ఒక ఫోటో పోస్ట్ చేసింది. బ్రౌన్.. బ్లాక్ కాంబినేషన్ చెక్స్ ఉన్న షర్టు వేసుకున్న రుహాని పైన రెండు బటన్లు వేసుకోకుండా నెటిజనులను టీజ్ చేసింది. వాటితో పాటుగా మూడో బటన్ ను కూడా విప్పుతున్నట్టుగా చేతులు పెట్టిమరీ పోజిచ్చింది. ఈ భామ హెయిర్ స్టైల్ కర్లీగా ఉండడంతో లుక్ స్టైలిష్ గా ఉంది. మెడలో బ్లాక్ కలర్ చెయిన్ వేసుకుంది గానీ వేరే యాక్సెసరీస్ అసలు లేవు. రుహాని ఎక్స్ ప్రెషన్ కూడా అదిరిపోయింది. క్యాజువల్ షర్టుతో ఇంత హాట్ గా కనిపించడం అనేది కూడా ఒక కళే. ఈ ఫోటోకు దాదాపుగా ఇరవై వేల లైకులు వచ్చాయి. ఆమె ఫాలోయర్ల సంఖ్య ఇంకా మిలియన్లలోకి చేరుకోలేదు కాబట్టి లైకులు తక్కువే ఉన్నాయి లేకపోతే ఇప్పటికే లైకుల సంఖ్య లక్షల్లో ఉండేది. ఈ లైకుల సంగతేమో గానీ ఫిలిం మేకర్లు కనుక ఈ ఫోటోలు చూస్తే ఆమెకు కొత్త ఆఫర్లు వచ్చే అవకాశం మాత్రం ఉంది.

కదం తొక్కిన చియాన్



చియాన్ విక్రమ్ యూనిక్ స్టైల్ గురించి చెప్పాల్సిన పనేలేదు. విశ్వనటుడు కమల్ హాసన్ తర్వాత అన్ని ప్రయోగాలు చేసింది విక్రమ్ అంటే అతిశయోక్తి కాదు. అపరిచితుడుగా శివపుత్రుడుగా నాన్నగా అతడి నటనను పదే పదే అభిమానులు తలచుకుంటారు. అందుకే గత నాలుగేళ్లుగా సక్సెస్ అన్నదే లేకపోయినా విక్రమ్ ఏ సినిమాలో నటించినా అందరిలోనూ ఏదో తెలియని ఆసక్తి. జయాపజయాలతో సంబంధం లేకుండా అతడి అభిమానులు థియేటర్లకు వెళుతున్నారు. విక్రమ్ నటించిన తాజా చిత్రం కదరం కందన్ ప్రస్తుతం టాక్ ఆఫ్ ది టౌన్. తాజాగా ఈ సినిమా టీజర్ ని రిలీజ్ చేశారు. చియాన్ కొత్త లుక్ లో స్ట్రైకింగ్ గా కనిపిస్తున్నాడు. రగ్గ్ డ్ ఆఫీసర్ గా.. నెరిసిన గడ్డంతో గన్ ఎక్కిపెట్టి జూలు విదులుస్తున్నాడు. భారీ యాక్షన్ ప్యాక్డ్ సినిమాతో ఈసారి మైమరిపించేందుకు వస్తున్నాడని అర్థమవుతోంది. ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. రాజ్ కమల్ ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై ఎం.సెల్వ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ బ్యానర్ లో ఇదివరకూ రిలీజైన చీకటి రాజ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా క్రిటిక్స్ ప్రశంసలు అందుకుంది. విక్రమ్ - అక్షర హాసన్- అభి హాసన్ (నాజర్ కుమారుడు) తదితరులు నటిస్తున్న ఈ సినిమా(కదరం కందన్) ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో వేచి చూడాలి. ఈ యాక్షన్ ప్యాక్డ్ చిత్రానికి గిబ్రాన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అద్భుతంగా కుదిరిందని టీజర్ చెబుతోంది.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660909, 93485 50909**